
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

మెదక్

20

ఆదివారం 20 ఆగస్టు 2017





- జిల్లాలో రెండ్రోజులుగా కురుస్తున్న ముసురు
- రైతుకు కాస్త ఊరట
- అయినా లోటు వర్షపాతమే
- చెరువులు, కుంటల్లోకి చేరని నీరు

పదిహేను రోజులనుంచి వర్షాలు లేక ఆందోళన చెందిన రైతులకు రెండ్రోజులుగా కురుస్తున్న చినుకులు కాస్త ఊరట నిచ్చాయి. వానలకోసం రైతన్నలు కప్పలకు పెళ్లిళ్లు.. శివాలయాల్లో సహస్రఘటాభిషేకాలు చేస్తూ దేవుళ్లకు మొర పెట్టుకున్నారు. వరుణుడు కరుణించాడో ఏమో గానీ ముసురు కమ్ముకొని చిరుజల్లులు కురుస్తున్నాయి. వరి నాట్లు వేసి.. ఎరువులు చల్లి ఏపుగా పెరిగే సమయానికి వర్షాలు లేకపోవడంతో వారు తల్లడిల్లారు. ఇప్పుడు పడుతున్న వర్షాలతో పంటలకు ఎంతో కొంత ఆసరా అవుతుందని అన్నదాతలు ఆశతో ఉన్నారు.

4

ఆశల జల్లులు



రాష్ట్ర స్థాయి స్వచ్ఛ పాఠశాలగా ఎంపికైన మూసాపేట పాఠశాల

బడంటే ఇదే!

- రాష్ట్ర స్థాయి స్వచ్ఛ పాఠశాలగా ఎంపికైన మూసాపేట స్కూలు
- పాఠశాల నిర్వహణపై రాష్ట్ర స్థాయి కమిటీ అధ్యయనం
- 92 పాయింట్లు దక్కించుకుని జిల్లాలోనే రికార్డు

20 లో

'స్వచ్ఛభారత్' పై సూచనలివ్వండి

- ఆసక్తి ఉంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయండి
- అత్యుత్తమమైన మూడు సలహాలకు బహుమతులు
- మొదటి బహుమతి రూ.3 లక్షలు
- కలెక్టర్ భారతిహోళికేరి

4

రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తాం

- అన్ని జిల్లాలకు నీరందేలా చూస్తాం
- పెండింగ్ ప్రాజెక్టులకు పెద్దపీట వేస్తాం
- సింగూరు కింద 40 వేల ఎకరాలకు సాగునీరందిస్తున్నాం: హరీశ్‌రావు




పెద్దశంకరంపేటలోని ఆంజనేయ స్వామి ఆలయంలో మంత్రి హరీశ్‌రావుకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న పూజారులు

5 లో

'పోలీసు' రగడ

- ఎమ్మెల్యేపై భగ్గుమన్న ప్రతిపక్షాలు
- జిల్లాలో చర్చనీయాంశమైన ఆంధ్రజ్యోతి కథనం
- నర్సాపూర్‌లోనే డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేయాలి
- లేదంటే ఆందోళన చేస్తాం: కాంగ్రెస్
- ఎమ్మెల్యే రాజీనామా చేయాల్సిందే: బీజేపీ

5



జూలైలో సీఎంకు ఇచ్చిన మరో లేఖ



అది కాదు..
మరో లేఖ ఇచ్చా..

నర్సాపూర్‌లోనే డీఎస్పీ కార్యాలయం
- ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

ఇంటర్వ్యూ



పాఠశాలల్లో డిజిటల్ తరగతుల
నిర్వహణకు చర్యలు

● భక్షి విజయరావు, యునిసెఫ్ రాష్ట్ర కో ఆర్డినేటర్

నారాయణఖేడ్ : పాఠశాలల్లో డిజిటల్ తరగతుల నిర్వహణకు యునిసెఫ్ ద్వారా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర కోఆర్డినేటర్ భక్షి విజయరావు ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

పాఠశాలల్లో డిజిటల్ తరగతులను ఏ విధంగా నిర్వహిస్తారు ?

పాఠశాలల విద్యార్థులకు ఆయా విషయాలు సులభరీతిలో అర్థంకావడం కోసం ప్రత్యేకంగా ఉపాధ్యాయుల ద్వారా డిజిటల్ పాఠ్యాంశాలను తయారు చేయించి బోధించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ఇప్పటి వరకు ఎన్ని పాఠ్యాంశాలు తయారు చేశారు ?

ఇప్పటి వరకు అన్ని విషయాల్లో కలిపి 400 వందల డిజిటల్ పాఠ్యాంశాలను తయారు చేయించాం.

మధ్యాహ్న భోజనం పరిశుభ్రతతో అందించేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు ?

మధ్యాహ్న భోజనాన్ని శుచి, శుభ్రతతో పాటు విద్యార్థులకు రుచిగా అందించాలనే ఆలోచనతో మా సంస్థ ద్వారా మధ్యాహ్న భోజనం నిర్వహకులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 28 వేల పాఠశాలలు ఉన్నాయి. ఇప్పటి వరకు చాలా పాఠశాలల భోజనం నిర్వహకులకు శిక్షణ ఇప్పించాం.

రాష్ట్ర వ్యాప్తంగా ఎంత మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందుతోంది ?

రాష్ట్ర వ్యాప్తంగా 32 లక్షల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అందిస్తుంది. భోజనాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు వండి వడ్డించే విధంగా మా సంస్థ అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తుంది.

పరిశుభ్రత కోసం చేపడుతున్న కార్యక్రమాలు ఏమిటి?

పరిశుభ్రత లేక పోవడంతోనే విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. అందువల్ల భోజనానికి ముందు తర్వాత చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలనే ఆలోచనతో మొదటి దశలో గురుకుల పాఠశాలల విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కార్యక్రమాలను కల్పిస్తున్నాం.



నారోజు రచించిన పుస్తక ముఖ చిత్రం


రాజమౌళి దంపతులను సన్మానిస్తున్న రచయితలు (ఫైల్)


నారోజు రాజమౌళి

నారోజు..
కవిత్వంలో రారాజు

● 7వేలకు పైగా పద్యాలు రాసిన రాజమౌళి
● చందోబద్దంగా ఏ అంశంపైనా అయినా రోజుకు వంద పద్యాలు రాయడంలో దిట్ట
● భగవద్గీతను తాత్పర్య సహితంగా తెలుగులోకి అనువదించిన కవి

హుస్నాబాద్ : వచన కవిత్వం సులభంగా రాసే ప్రకియ. ఇందులో స్వేచ్ఛ ఉంటుంది. కాని పద్యం అంత సులువుగా రచించేది కాదు. పద్యం చందోబద్దంగా ఉండాలి. పద సంపద, శుద్దత ఉండాలి. కట్టుబాటులో రాయాలి. చివరి పాదం తీసుకుంటే నాలుగు పాదాలు, పద్యం భావం అర్ధ యుక్తంగా ఉండాలి. పద్యం సామాన్యుల దగ్గరికి చేరనప్పటికీ అందులో మంచి రమ్యత ఉంటుందంటారు రచయితలు. అందుకే పద్యం శాశ్వతమైనదంటారు. ప్రస్తుతం పద్యాలు రాసే కవులు అరుదు. కాని హుస్నాబాద్ పట్టణంలోని గణేశ్ నగర్‌కు చెందిన నారోజు రాజమౌళి పద్య కవిత్వంలో రారాజుగా నిలుస్తున్నారు. హుస్నాబాద్ మండలం పొట్లపల్లికి చెందిన నారోజు రాజమౌళి హుస్నాబాద్‌లో స్థిరపడ్డారు. చిన్న నాటినుంచే పద్యాలు రాయడం అలవాటుగా మార్చుకున్నారు ఈయన. జెజ్జంకిలో ఏడో తరగతి చదువుతున్న సమయంలో అక్కడి తెలుగు మాస్టర్ రాజమౌళిని ప్రోత్సహించారు. పదో తరగతి నుంచి పద్య కవిత్వంలో కావ్యాలు రాశారు. ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా పని చేస్తూనే బీఏ తెలుగు చదివారు. రాజమౌళి ఏకంగా ఏడు వేల పద్యాలు రాశారు. ఏదైనా ఒక అంశం ఇస్తే చందోబద్దంగా ఒకే రోజు వంద పద్యాలు అలవోకగా రాయగలిగే సాహితీవేత్త. పద్యాలే కాదు.. స్టేజీ నాటకాలు, శ్లోకాలు కూడా ఈయన రచించారు. పద్య రచనల్లో ఎన్నో ప్రయోగాలు చేశారు. ఈయన సామాన్యులకు కూడా అర్ధమయ్యేలా రచనలు చేశారు. ఎక్కువగా అధ్యాత్మికతకు రచనలకు ప్రాధాన్యత ఇస్తారు ఈయన. అలాగని సామాజిక అంశాలను విస్మరించలేదు. వీటిపై కూడ పద్య ప్రక్రియలోనే రచనలు చేశారు. వాస్తు జ్యోతిష్య శాస్త్రంలో కూడా ఈయనకు ప్రావీణ్యం ఉంది. వేదాల్లో పరిచయం ఉంది. ఉపనిషత్తులు, ఇతిహాసాలు, పురాణాల్లో ప్రావీణ్యం ఉంది. ఎన్నో కావ్యాలకు ముందు మాట రాశారు. పద్యం చివరి పాదం ఇస్తే పద్యమును పూర్తిగా రాసే సమస్యాపూరణ ప్రక్రియలో రాజమౌళి అందే వేసిన చేయి. అందుకే రాజమౌళి రచించిన శ్రీ జానకి రామ శతకంను రాజయోగాశ్రమం (రంజోహి) మఠాధిపతి యం రాచయ్య చదివి...

శ్రీ జానకీరామశతక రచన భవసాగరపు నావ
భవరోగహరమునకు దివ్యగుళిక
సకల జనులకు తెలిసేడి సరళ రచన
నరుని హరునిగజేయు నారోజు రచన..అని ప్రశంసలు కురిపించారు.

రాజమౌళి రచించిన పద్యకావ్యాలు

నారోజు రాజమౌళి రచించిన పద్యాకావ్యాలు దాదాపు పది వరకు ఉన్నాయి. విశ్వనాథ శతకం (ఆటవెలది), పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వర శతకం (సీసపద్యాలు), యోగి మేమన శతకం (కందం), శ్రీమద్భవగద్గీత (తేటగీతులు), శ్రీ జానకీ రామ శతకం (తేటగీతి), విభవసారం (తేటగీతి), వెయ్యి పద్యాల శ్రీరఘువర చరితం (కందం), హనుమాన్ సుప్రభాతం, పొట్లపల్లి స్వయం సుప్రభాతం (శ్లోకాలు), అముద్రితాలు వృకవిలాపం, (ఉత్పల మాల), ఉగాదులు, ఉషస్సులు (ఉత్పల మాల), బ్రహ్మంగారి జీవిత చరిత్ర (స్టేజీనాటకం) రాశారు.

పద్యంలో ప్రయోగాలు

సంస్కృతంలో ఉన్న శ్రీమద్భగవద్గీతను తాత్పర్య సహితంగా తేట గీతి పద్యాలతో తెలుగులోకి అనువదించారు రాజమౌళి. రామాయణం, భారతం, భాగవతాల మూలాన్ని మార్చకుండా పద్యాలు రాశారు. రాజమౌళి పద్యాల్లో మకుటాలు కూడా ఉన్నాయి. అవే పదాలు పదేపదే వాడుతూ అర్థాలు మాత్రం వేరే వచ్చే విధంగా పద ప్రయోగం చేస్తారు. రఘువర చరితంలోని 800 పద్యాలు కేవలం 20 రోజుల్లో పూర్తి చేశారు. రోజుకు వంద పద్యాలు అలవోకగా రాయగలరు.

బిరుదులు

రాజమౌళికి పలు సంస్థలు బిరుదులు ప్రధానం చేశాయి. లయన్స్ క్లబ్ వారు కవితా భూషణ, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి స్మారక అవార్డు, హుస్నాబాద్ కవి బృందం అపర వాల్మీకీ బిరుదులు ప్రదానం చేశారు. ఎన్నో సంస్థలు రాజమౌళిని సన్మానించాయి. పెందోట వెంకటేశ్వర్లు రాసిన బ్రహ్మంగారి జీవిత చరిత్రకు (సిద్దిపేట), తరిగొప్పుల నారాయణస్వామి రాసిన భాగవతం, చంద్రశేఖర శతకాలకు ముందు మాట రాశారు. పలువురు పదవీవిరమణ పొందిన సందర్భంగా రచనలు చేశారు. కుటుంబ సభ్యులు ముఖ్యంగా తన భార్య ప్రేమలతాదేవి సహకారంతో రచనల్లో మరింత వేగం పెంచడానికి కారణమైందంటారు రాజమౌళి.

వాస్తు జ్యోతిష్య శాస్త్రాల్లో ప్రావీణ్యం

రాజమౌళికి వాస్తు, జ్యోతిష్య శాస్త్రాల్లో కూడ ప్రావీణ్యం ఉంది. ఇళ్ల నిర్మాణాల కోసం వాస్తు సలహాలు తీసుకునేందుకు నిత్యం ప్రజలు ఆయన వద్దకు వస్తుంటారు. జ్యోతిష్యంలోనూ సంప్రదిస్తారు.

ఉపయుక్తమైన రచనలు ఉండాలి

భావ అర్థముల సమ్మేళనమే శుద్ధం. అలాంటి శుద్ధమైన రచనలుండాలి. అందరికీ ఉపయుక్తమైన రచనలు ఉండాలి. ఒక రచన చదివితే పాఠకుడి భావనలో మార్పు తీసుకువచ్చే విధంగా, హృదయాలను హత్తుకునేలా ఉండాలి. పద్యం శాశ్వతమైనది. పద్యం కట్టుబాటులో రాయాల్సి ఉంటుంది. 50వేల పద్యాలు రాయాలనేది నా సంకల్పం.

- నారోజు రాజమౌళి, కవి రచయిత


నారోజు రచించిన పుస్తకాలు

సమస్యలు పరిష్కరించే వరకు
సమ్మె కొనసాగిస్తాం

● శిరోమణి , డాక్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు

ఉద్యోగపర్వం




డాక్ ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం. మాపై పనిభారం అధికమైంది. అందువల్ల ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలి. పెన్షన్ సౌకర్యాన్ని కూడా కల్పించాలి. కమలేష్‌చంద్ర కమిటీ సిఫార్సులను కూడా అమలు చేయాలి. మమ్మల్ని కూడా సివిల్ సర్వెంట్ ఉద్యోగులుగా గుర్తించాలి. ఈ మేరకు అఖిల భారత డాక్ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు సమ్మెను చేస్తున్నాం. అందువల్ల ప్రభుత్వం తమ న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలి. **- నారాయణఖేడ్**

భక్తుల ఇష్టదైవంగా కొలువుదీరిన శ్రీకృష్ణుడు

భక్తి

● పురుషోత్తమ చారి, పూజారి



భక్తుల ఇష్టదైవంగా శ్రీకృష్ణుడు బాసిల్లుతున్నాడు. నారాయణఖేడ్‌లో దశాబ్దాల క్రితం శ్రీకృష్ణ మందిర్‌ను నిర్మించి రాధాకృష్ణుల పంచలోహ విగ్రహాలను ప్రతిష్టింపజేసి నిత్య పూజలు నిర్వహించే వారు. మూడు దశాబ్దాల క్రితం దొంగలు ఆలయంలోని పంచలోహ విగ్రహాలను దొంగిలించుకుపోయారు. పది సంవత్సరాలకు పైగా ఆలయంలో నిత్య పూజలు కొనసాగలేదు. ఆలయ వ్యవస్థాపకుడు నందుసేట్ 2006లో జైపూర్ నుంచి ప్రత్యేకంగా రాధాకృష్ణుల విగ్రహాలను తెప్పించి ఆలయంలో ప్రతిష్టింపజేశారు. ఆలయ ఆవరణలో గోశాలను ఏర్పాటు చేశారు. పదకొండు సంవత్సరాలుగా ఆలయంలో నిత్య పూజలు కొనసాగుతున్నాయి. శ్రీకృష్ణజన్మాష్టమి, కార్తీక పౌర్ణమి, వైకుంఠ ఏకాదశి, కౌజాగిర్ పౌర్ణమి, గోవర్ధన గిరి పూజలు ఇక్కడ ప్రత్యేకంగా నిర్వహిస్తుంటారు. దేవాలయంలో భక్తుల సంఖ్య ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉంది. ఆలయంలో భక్తుల సహకారంతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.



- నారాయణఖేడ్

బతుకమ్మ చీరల జాబితా రూపొందించాలి

• జాయింట్ కలెక్టర్ పద్మాకర్



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న జేసీ పద్మాకర్

సిద్దిపేట రూరల్ : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బతుకమ్మ చీరల పంపిణీ పారదర్శకంగా నిర్వహించేందుకు రేషన్ డీలర్లు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ పద్మాకర్ సూచించారు. శనివారం రాత్రి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన వీడియో కాన్ఫరెన్సులో జేసీ మాట్లాడారు. తెల్లరేషన్ కార్డు కలిగిన వారి జాబితా రూపొందించాలని సూచించారు. బతుకమ్మ చీరలు అందించేందుకు లబ్ధిదారుల ఎంపికలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, గ్రామ వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, వీవో లీడర్లు సభ్యులుగా ఉంటారని తెలిపారు. దీపం పథకానికి అర్హులైన వారిని గుర్తిస్తే గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తామన్నారు. రేషన్ సరుకులు ఈ పాస్ ద్వారా ఈ నెల 25వరకు పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి వెంకటేశ్వర్లుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి దరఖాస్తుల స్వీకరణ

సిద్దిపేట రూరల్: సిద్దిపేట జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నవీన్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 2017-18 సంవత్సరానికి గాను ప్రధానమంత్రి స్వయం ఉపాధి ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పరిశ్రమల కేంద్రం , కేవీఐసీ, కేవీఐబీ పథకాల ద్వారా రుణ సౌకర్యం అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత లబ్ధిదారులకు మున్సిపల్, నగర పంచాయతీలలోని లబ్ధిదారులకు 25 శాతం ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు.

అటవీ శాఖ ఉద్యోగాలకు ఉచిత కోచింగ్

సిద్దిపేట రూరల్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన అటవీశాఖలోని ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థులకు సిద్దిపేట బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు డైరెక్టర్ రాములు తెలిపారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ , ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్, బీట్ ఆఫీసర్స్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 21 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. టీఎస్‌బీసీ స్టడీ సర్కిల్ . సీజీజీ. జీవోవీ. ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు . గ్రామీణ ప్రాంత అభ్యర్థులు రూ. లక్ష 50 వేలు , పట్టణ ప్రాంత అభ్యర్థులు రూ. 2 లక్షల ఆదాయం కలిగిన వారు ఉచిత కోచింగ్‌కు అర్హులని చెప్పారు. సెప్టెంబర్ 4 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. 08457-224941 , 9985434941 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పీఆర్ ఈఈపై కలెక్టర్‌కు ఫిర్యాదు

సిద్దిపేట రూరల్ : పంచాయతీరాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజశేఖర్‌రెడ్డిపై కాంట్రాక్టర్ శ్యాంసుందర్ శనివారం సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం కాంట్రాక్టర్ విలేకరులతో మాట్లాడుతూ చేర్యాల మండలం అంగడి కిష్టాపూర్ మదిర గ్రామమైన గణేశ్‌పల్లిలో కుల సంఘం భవనం నిర్మించి మూడు నెలలు గడిచినా బిల్లు ఇవ్వడం లేదంటూ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదన్నారు. ఇదే విషయంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా బిల్లు మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. శనివారం పంచాయతీరాజ్ కార్యాలయంకు వెళ్లి ఈఈని కలిసి బిల్లు ఇవ్వాలని కోరగా ఎంబీ రికార్డు బుక్ టెబుల్‌పై పెట్టి వెళ్లిపోమ్మంటూ దూషించారని కాంట్రాక్టర్ తెలిపారు. చెప్పుకోలేని పదజాలంతో దూషించారని, తన ఛాంబర్ నుంచి వెళ్లిపొమ్మంటూ తిట్టారని చెప్పారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పాము కాటుతో బాలుడి మృతి

నంగునూరు : మండలంలోని సిద్దన్నపేటలో కూలీలుగా పనిచేస్తున్న శ్రీనివాస్ కుమారుడు సిద్దు (6) శనివారం పాము కాటుకు గురై మృతి చెందాడు. ఖమ్మం జిల్లా బియ్యారం గ్రామానికి చెందిన శ్రీనివాస్, మనకమ్మ వలస కూలీలు. సిద్దన్నపేట నుంచి మల్లారం వరకు చేపట్టిన రోడ్డు పనుల్లో భాగంగా అదే గ్రామానికి చెందిన కొందరు కూలీలతో కలిసి నంగునూరు మండలం సిద్దన్నపేట శివారులో ఉన్న కొట్టంలో తాత్కాలికంగా నివాసం ఉంటున్నారు. శనివారం తెల్లవారుజామున సిద్దుకు పాముకు కరిచింది. అపస్మారక స్థితిలోకి వెళ్లగా తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే బాలుడు మృతి చెందాడని వైద్యులు తెలిపారు.

విషం తాగి ఇద్దరు ఆత్మహత్యాయత్నం

• మొదటి భార్య ఉండగానే మరో వివాహం
• న్యాయం చేయాలంటూ పోలీస్ స్టేషన్‌లో భార్య సంతోష ఫిర్యాదు
• భార్యాభర్తల మధ్య గొడవ
• రెండో భార్యతో కలిసి విష గుళికలు మింగిన భర్త
• భార్య మృతి, భర్త పరిస్థితి విషమం



జ్యోతి (ఫైల్)

వెల్దుర్తి: భార్య ఉండగా రెండో వివాహం చేసుకున్న వ్యక్తి భార్యతో సహా విష గుళికలు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటనలో భార్య మృతి చెందగా ప్రియుడి పరిస్థితి విషమంగా ఉంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వెల్దుర్తి మండలం మెళ్లూరు గ్రామానికి చెందిన రావుల బాబుకు కొన్నేళ్ల క్రితం కొడిపల్లి మండలం ముట్రాజ్ పల్లికి చెందిన సంతోషతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. బాబు కుటుంబ పోషణ కోసం ఆటో నడుపుతుంటాడు. వెల్దుర్తికి చెందిన పోతరాజు జ్యోతి (20) మెడ్చెల్‌లో పని చేస్తోంది. రోజూ బాబు ఆటోలో రాకపోకలు సాగించేది. ఈ క్రమంలో వీరి మధ్య పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త ప్రేమగా మా రింది. బాబు మొదటి భార్యకు తెలియకుండా వివాహం చేసుకున్నాడు. మేడ్చెల్‌లోనే వేరే కాపురం పెట్టారు. విషయం తెలుసుకున్న మొదటి భార్య సంతోష తనకు న్యాయం చేయాలని కౌడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విషయం తెలుసుకున్న బాబు, జ్యోతి గ్రామానికి వస్తూ తూప్రాన్ వద్ద విష గుళికలు కొనుగోలు చేశారు. బాబు ఇంటి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేశావంటూ మందలించాడు. గొడవ పెద్దది కావడంతో ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. శుక్రవారం రాత్రి బాబు, జ్యోతిలు విషగుళికలు మింగారు. గమనించిన స్థానికులు చికిత్స కోసం గాంధీకి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జ్యోతి మృతి చెందగా బాబు పరిస్థితి విషమంగా ఉన్నట్లు వెల్దుర్తి పోలీసులు తెలిపారు. తూప్రాన్ సీఐ లింగేశ్వర్‌రావు వెల్దుర్తికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మాయమాటలతో మహిళను బురిడీ కొట్టించిన యువకులు

• డబ్బు లెక్కిస్తామని రూ. 10 వేలతో ఉడాయించిన వైనం
• బ్యాంకులో ఘటన
• పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు



బాధితురాలు భాగ్యమ్మ

నర్సాపూర్: మాయమాటలతో మహిళను ఇద్దరు యువకులు బురిడీ కొట్టించారు. డబ్బు లెక్కిస్తామని రూ. 10వేలతో ఉడాయించారు. ఈ ఘటన నర్సాపూర్‌లో ఎస్‌బీఐలో శనివారం చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శివ్వంపేట మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన భాగ్యమ్మ మరో మహిళతో కలిసి డ్వాక్రా గ్రూపునకు సంబంధించిన రూ. 23 వేలు డ్రా చేయడానికి నర్సాపూర్ ఎస్‌బీఐకి వచ్చింది. ఇప్పటికే బ్యాంకులో ఉన్న ఇద్దరు యువకులు మహిళలతో మాటలు కలిపారు. బ్యాంకుల్లో కూడా నకిలీ నోట్లు వస్తున్నాయని భయపెట్టారు. తాము గుర్తిస్తామని చెప్పారు. యువకుల మాయమాటలు నమ్మిన మహిళలు బ్యాంకులో డ్రా చేసుకున్న రూ 23 వేలు ఇచ్చారు. అందులో నుంచి రూ. 10వేలు తీసుకొని యువకులు బయటికి పరుగు తీశారు. వెంటనే తేరుకున్న మహిళలు అరుపులు చేస్తూ బయటకు వచ్చారు. అప్పటికే యువకులు పల్సర్ బైక్‌పై అతివేగంగా పరారయ్యాయి. కొందరు వెంబడించినా లాభం లేకపోయింది. దీంతో బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. న్యాయం చేయాలని బాధితురాలు వేడుకుంది.

'కుమ్మరుల సమస్యలను పరిష్కరిస్తా'

ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్

సిద్దిపేట కల్చరల్: కుమ్మరుల సమస్యలను పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ హామీ యిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా కుల వృత్తులపై ఆధారపడిన కుల సంఘాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తానని హామీనిచ్చారు. శనివారం ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ ను తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కట్కూరి రవీందర్, నాయకులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి కుమ్మరులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. సంఘం నాయకులు భూ మయ్య, రామచంద్రం, శ్రీనివాస్, వెంకట్, రాజు, రాము, నాగరాజు తదితరుల పాల్గొన్నారు.

కూరగాయల సాగులో జిల్లాను నంబర్‌వన్‌గా నిలుపుతాం



మహిళా రైతులతో మాట్లాడుతున్న కమిషనర్

గజ్వేల్‌అర్బన్/ములుగు: కూరగాయల సాగులో సిద్దిపేట జిల్లాను దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ఉద్యానవనశాఖ కమిషనర్ వెంకట్రామారెడ్డి అన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలోని ములుగు మండల కేంద్రంలో సెంటర్ ఫర్ ఎక్సలెన్సీని ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం గజ్వేల్ మండల పరిధిలోని ప్రజ్ఞాపూర్ రాజీవ్‌రహదారి పక్కన ఏర్పాటు చేసిన రైతు మార్కెట్‌లో మహిళా రైతులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బజార్లలో రైతులే నేరుగా తమ పంటలను విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ క్రమంలో ఇప్పటికే 14 రైతుబజార్లను పరిశీలించినట్లు తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గజ్వేల్‌లో రైతు మార్కెట్‌ను మంత్రి ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేయించడం హర్షణీయమన్నారు. మొబైల్ మార్కెట్‌లు రాష్ట్రంలో చాలా చోట్ల అవసరమున్నాయని తెలిపారు. రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1300 కోట్ల బడ్జెట్‌ను ఉద్యానవన శాఖకు కేటాయించామని తెలియజేశారు. సిద్దిపేట జిల్లాలో ఉద్యానవన సాగును ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా కోటి రూపాయలను మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు కేటాయించామని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో పందిరి సాగు, డ్రిప్ సాగులో రాష్ట్రంలోనే సిద్దిపేట జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని, దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్ట్



నిందితులతో ఏసీపీ నర్సింహారెడ్డి

సిద్దిపేట క్రైం: జల్సాలకు, చెడు వ్యసనాలకు బానిసలై సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశ్యంతో దొంగతనమే మార్గంగా ఎంచుకున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసిన సంఘటన సిద్దిపేట పట్టణంలో జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం విలేకరుల సమావేశంలో ఏసీపీ నర్సింహారెడ్డి వెల్లడించారు. సిద్దిపేట పట్టణంలోని భారత్‌నగర్‌కు చెందిన బంగారి అనిల్, విజయ్ లు జల్సాలకు అలవాటు పడి తాళం వేసిన ఇంట్లో చొరబడి బంగారు అభరణాలు, నగదు దొంగిలించారని తెలిపారు. జనవరిలో టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆదర్శనగర్‌లో బెజుగామ లింగమూర్తి ఇంట్లో పగటిపూట ఈ ఇద్దరు వ్యక్తులు కలిసి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని బంగారు, వెండి వస్తువులను, నగదును దొంగిలించారన్నారు. ఈ వస్తువులను అమ్ముకొనుటకు కరీంనగర్ వెళ్తుండగా నర్సాపూర్ చౌరస్తాలో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా సీఐ ఆంజనేయులు అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారని తెలిపారు. వీరి వద్ద నుంచి 6 తులాల బంగారం, 5 తులాల వెండి వస్తువులను స్వాధీన పరుచుకొని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆశల జల్లులు

- జిల్లాలో రెండ్రోజులుగా కురుస్తున్న ముసురు
- రైతుకు కాస్త ఊరట
- అయినా లోటు వర్షపాతమే
- చెరువులు, కుంటల్లోకి చేరని నీరు



వెల్దుర్తి మండలకేంద్రంలో కురుస్తున్న వర్షం

మెదక్: వానా వానా వల్లప్పా.. వరుణ దేవా కరుణించూ.. అంటూ కప్పలకు పెళ్లిళ్లు.. శివాలయాల్లో సహస్రఘటాభిషేకాలు చేస్తూ రైతులు దేవుళ్లను వేడుకుంటూనే ఉన్నారు. చివరికి దేవుడు వారి మొర ఆలకించినట్లున్నారు. జిల్లా వ్యాప్తంగా రెండ్రోజులుగా ముసురు కమ్ముకొని చిరుజల్లులు కురుస్తున్నాయి. పదిహేను రోజులనుంచి వర్షాలు లేక ఆందోళన చెందిన రైతులకు కాస్త ఊరటనిస్తోంది. వరి నాట్లు వేసి.. ఎరువులు చల్లి ఏపుగా పెరిగే సమయానికి వర్షాలు కురియకపోవడంతో రైతులు తల్లడిల్లారు. ప్రస్తుతం కురుస్తున్న వానలు పంటలకు ఎంతో ప్రయోజనకరమని వ్యవసాయశాఖ అధికారులు చెపుతున్నారు. ఇక చెరువుల్లోకి నీరు చేరకపోవడంతో రైతులు సేద్యానికి బోర్లపైనే ఆధారపడుతున్నారు.

జిల్లాలో కురిసింది 28.24 మి.మీ.

జిల్లాలో రెండ్రోరోజులుగా వర్షం కురుస్తోంది. శుక్రవారం పగలంతా కారుమేఘాలు కమ్ముకోగా రాత్రి ఓ మోస్తరు తుంపర్లతో కూడిన వర్షం పడింది. శనివారం ఉదయం 9 గంటల నుంచి ముసురుతో వర్షం కురుస్తూనే ఉంది. సాయంత్రం వేళ జిల్లా కేంద్రంలో ఓ మోస్తరు కురిసింది. కారుమేఘాలు కమ్ముకోవడంతో శనివారం సూర్యోదయం కనిపించలేదు. సీజన్ ప్రారంభంలో జిల్లాలో భారీ వర్షాలు కురవడంతో రైతులు ఆనందోత్సాహాలతో వ్యవసాయ పనులను ప్రారంభించారు. ఆ తర్వాత జులైలో ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. ఇక ఆగస్టు రెండో వారంలో వర్షం కురిసినప్పటికీ సగటు వర్షపాతాన్నే చేరుకుంది. జిల్లాలో రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురిసిన వర్షం 28.24 మిల్లీమీటర్లుగా నమోదైంది. తూప్రాన్ మండలంలో 4.6 మి.మీ. వర్షం జిల్లాలో అత్యధికంగా నమోదైంది. ఆ తర్వాత నార్సింగి మండలకేంద్రంలో 3.5 మి.మీ., రామాయంపేటలో 3.45 మి.మీ., వెల్దుర్తిలో 2.23 మి.మీ., శివ్వంపేటలో 2.25 మి.మీ. వర్షం నమోదైంది.

దోబూచులాట

వర్ష రుతువులో వర్షాలు కురియకపోవడం కలవరపెడుతోంది. ఇప్పటి వరకు కురిసిన వర్షాలకు ఏ చెరువులోనూ కొత్తగా నీరు చేరలేదు. కుంటలు ఇక సరేసరి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నేల తడిసి బురదగా మారుతోందే తప్ప నీరు నిలవడంలేదు.

మండలం	కురిసిన వర్షం మి.మీ.
పెద్దశంకరంపేట	0
రేగోడ్	0.85
అల్లాదుర్గ్	0.15
టేక్మాల్	0.1
పాపన్నపేట	0.27
హవేళీఘణపూర్	0.67
రామాయంపేట	3.45
నిజాంపేట	0
చేగుంట	2.55
నార్సింగి	3.5
చిన్నశంకరంపేట	1.6
మెదక్	1.67
కొల్చారం	0.65
చిలప్‌చెడ్	0.5
కౌడిపల్లి	1.67
నర్సాపూర్	0.63
శివ్వంపేట	2.25
వెల్దుర్తి	2.23
తూప్రాన్	4.6
మనోహరాబాద్	0.9
మొత్తం	28.24

జిల్లాలో భూగర్భజలాలు 17మీటర్లకు తగ్గిపోయాయని భూగర్భ జల వనరుల శాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్‌రావు 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు. ఆగస్టులో గట్టి వర్షాలు కురియకపోతే రానున్న రోజుల్లో నెట్టుకు రావడం కష్టమేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో వర్షం దోబూచులాడుతుండడంతో ప్రారంభంలో వరినాట్లు వేసిన రైతులే పంటను కాపాడుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. మిగతా రైతులు వరిజోలికి పోకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు ఆకర్షితులవుతున్నారు. టేక్మాల్, అల్లాదుర్గం, పెద్ద శంకరంపేట, రేగోడ్ మండలాల్లో మొక్కజొన్న, కంది, పెసర, పంటలకు వర్షం ప్రయోజనం చేకూరుస్తోంది.

నేటినుంచి ఇంటింటా మొక్కలు

- మర్క్యూక్, పాములపర్తి నుంచి స్వీకారం
- ఇంటింటికీ పండ్లు, పూలు, నీడనిచ్చే 16 రకాల 12 మొక్కలను అందజేస్తాం
- గడ ప్రత్యేకాధికారి హన్మంతరావు



పాములపర్తిలో ప్రభుత్వ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న గడ హన్మంతరావు

వర్గల్/మర్క్యూక్ : ఇంటింటికి మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం నుంచి మర్క్యూక్ మండల కేంద్రంతో పాటు పాములపర్తి నుంచి స్వీకారం చుట్టనున్నట్లు గడ ప్రత్యేకాధికారి హన్మంతరావు తెలిపారు. శనివారం పాములపర్తిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. ఇంటింటికి మొక్కలు నాటే కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి పండ్లు, పూలు, నీడనిచ్చే 12 మొక్కల చొప్పున అందజేస్తామన్నారు.

బాదం, మామిడి, జామ, ఉసిరి, సీతాఫల్, పనస, దానిమ్మ, అల్లనేరెడు, కరివేపాకు, బొప్పాయి, సపోట, బొడ్డుమల్లె, మందారం, సంపంగి, గన్నేరు, బోహనీయా వంటి 16 రకాల మొక్కలను అందజేయనున్నట్లు తెలిపారు. మొక్కలను ఇంటి ముందు ఉన్న ఖాళీ స్థలంలో, ఇంటి అవరణలో నాటుకోవాలన్నారు. ఇళ్లతో పాటు గ్రామంలో ఉన్న ఖాళీ స్థలంలో, అంతర్గత వీదులో మొక్కలు నాటడం జరుగుతుం దన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేష్‌బాబు, ఫారెస్టు అధికారులు రామారావు, కిరన్, ఎంపీడీవో శ్రీనివాస్, ఈవోపీఆర్‌డీ స్వర్ణకుమారి, ఈజీఎస్ ఏపీఎం నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వికాస్, నాయకులు కనకయ్య, రాజేశ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు ఉన్నారు.

'స్వచ్ఛభారత్'పై సూచనలివ్వండి

- ఆసక్తి ఉంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయండి
- అత్యుత్తమమైన మూడు సలహాలకు బహుమతులు
- మొదటి బహుమతి రూ.3 లక్షలు
- కలెక్టర్ భారతిహోళికేరి

మెదక్ అర్బన్: కేంద్రప్రభుత్వం స్వచ్ఛభారత్‌లో భాగంగా ప్రజల నుంచి ఆరు అంశాలపై సమస్యల పరిష్కారానికి సలహాలు, సూచనలు కోరడం జరుగుతుందని, ఆసక్తి ఉన్న వారు నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాలని కలెక్టర్ భారతిహోళికేరి శనివారం ప్రకటనలో తెలిపారు.

- నిర్మించిన మరుగుదొడ్ల వినియోగాన్ని పర్యవేక్షించేందుకు సాంకేతిక పరిష్కారాలు.
- మరుగుదొడ్ల ఉపయోగం, పరిశుభ్రత కోసం ప్రజల్లో మార్పు తీసుకురావడానికి పరిష్కారాలు.
- పర్వత, వరదలకు గురయ్యే మారుమూల ప్రాంతాల కోసం వినూత్నమైన, స్థిరమైన పర్యావరణానికి అనుకూలమైన మరుగుదొడ్ల టెక్నాలజీ.
- పాఠశాలలో మరుగుదొడ్ల నిర్వహణను మెరుగు పరిచేందుకు వినూత్న నమూనాలు, పద్ధతులు.
- రుతుస్రావం వ్యర్థాలను సురక్షితంగా విసర్జించడం కోసం కావాల్సిన సాంకేతిక పరిష్కారాలు.
- కుళ్లిన వ్యర్థాలు, చెడు వాసన రాకుండా పరిష్కారాలు.
- కేంద్ర ప్రభుత్వం ప్రజల నుంచి ఆరు అంశాల్లో సలహాలు, సూచ నలు కోరుతుంది. వాటిలో అత్యుత్తమమైన మూడు సూచనలను పరి గణలోకి తీసుకొని బహుమతులు అందజేయడం జరుగుతుంది. మొదటి బహుమతి రూ.3 లక్షలు, ద్వితీయ బహు మతి రూ.1.5 లక్షలు, తృతీయ బహుమతి రూ.50 వేలు అందజేస్తుంది. ఆసక్తిగల వారు హెచ్‌టీటీపీఎస్;// ఐఎన్ఎన్ఓవీఏటీఈ.ఎంవైజీవోవి.ఇన్/స్వచ్‌హతన్-1-0 వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ భారతిహోళికేరి



కలెక్టరేట్‌లో హాజరైన వివిధశాఖల అధికారులు

వచ్చేనెల15 వరకైనా ఓడీఎఫ్ జిల్లాగా ప్రకటిద్దాం

ఆ దిశగా 'మరుగుదొడ్ల'ను పూర్తిచేయండి

మెదక్: జిల్లా వ్యాప్తంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం వేగవంతం చేసి సెప్టెంబర్ 15 నాటికి అన్ని గ్రామాలను ఓడీఎఫ్ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్ భారతిహోళికేరి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలతో స్వచ్ఛభారత్ ప్రాజెక్టుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేసి సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేయాలని సూచించారు. ఆదిశగా మండలాల ప్రత్యేకాధికారులు ప్రత్యేక కృషిచేయాలన్నారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు స్వచ్ఛభారత్ కింద జిల్లాకు రూ.24 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. డబ్బులు సకాలంలో అందడంలేదని నిర్మాణాలు నిలిపివేయడం సరికాదన్నారు. అన్ని మండలాల్లో డబ్బులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఉపాధిహామీలో భాగంగా ఆయా గ్రామాల్లో కూలీలకు పని దినాలను పెంచాలన్నారు. అన్ని మండలాల్లో హరితహారం లక్ష్యాన్ని పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీవో సీతారామారావు, ఆర్డీవోలు నగేష్, వెంకటేశ్వర్లు, మధు అన్ని మండలాల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

'కాళేశ్వరం'పై ప్రజాభిప్రాయ సేకరణలో జాప్యం వద్దు

సమీక్ష సమావేశంలో కలెక్టర్ భారతిహోళికేరి

మెదక్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబందించి ప్రజాభిప్రాయ సేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ భారతిహోళికేరి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నీటిపారుదలశాఖ, మత్స్యశాఖ, వ్యవసాయశాఖ, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రాజెక్టు నిర్మా ణానికి కావాల్సిన అనుమతులతో పాటు ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు పనులను వేగవంతం చేయాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రధాన కాలువ మెదక్‌జిల్లాలో 50 కి.మీ. ప్రవహిస్తుందని, కాలువ నిర్మాణం ద్వారా 16 మండలాలకు సాగునీరందించే అవకాశముం దని తెలిపారు. ఆయా మండలాల్లోని గ్రామాల్లో ప్రాజెక్టు నిర్మాణానికి భూసే కరణ ఎంత అవసరమవుతుందో పూర్తి వివరాలను సేకరించాలని సూచించారు. కాళేశ్వరం నిర్మాణం వల్ల రైతులకు ఒనగూరే లాభాలను తెలపాలన్నారు. గతంలో ఉన్న ఆయకట్టు.. ప్రాజెక్టు నిర్మాణం తర్వాత ఎంతమేర విస్తీర్ణం పెరుగుతుందో వివరంగా పేర్కొనాల్సి ఉంటుం దన్నారు. జిల్లాలో ప్రాజెక్టు ఐదు దశల్లో నిర్మాణం జరుగుతుం దని కాళే శ్వరం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తనికేష్ కలెక్టర్‌కు వివరించారు. 13, 17, 18, 19, 22 ఫేజ్‌లలో ప్రాజెక్టును నిర్మిస్తున్నట్లు తెలిపారు.

డీఎస్పీ కార్యాలయం నర్సాపూర్‌లోనే

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్



విలేకరులతో మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్

నర్సాపూర్: కొత్తగా మంజూరు కానున్న పోలీసు సబ్ డివిజన్ కార్యాలయం నర్సాపూర్‌లోనే ఏర్పాటవుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డి.చంద్రాగౌడ్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం నర్సాపూర్ ఎంపీపీ చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. డీఎస్పీ కార్యాలయం కౌడిపల్లిలో ఏర్పాటు చేయడానికి ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారంటూ వస్తున్న ప్రచారం అవాస్తవమని వారు ఖండించారు. పొరపాటున లేఖలో జరిగిన చిన్న తప్పిదం వల్ల తప్పుడు సంకేతాలు వెళ్లాయన్నారు. ముఖ్యమంత్రికి స్థానిక ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మరో లేఖను నర్సాపూర్‌లో డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, టీఆర్ఎస్ జిల్లా నాయకులు అశోక్‌గౌడ్, హబీబ్ ఖాన్, పార్టీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, కోఆపరేటివ్ డైరెక్టర్ కృపాచారి, నాయకులు సురేశ్ తదితరులు

పనులు చేయని కాంట్రాక్టర్ల డిపాజిట్లు జప్తు చేయండి

- స్థాయీ సంఘం సమావేశంలో సభ్యుల మండిపాటు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్ : జిల్లాలో ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించని కాంట్రాక్టర్ల డిపాజిట్లను జప్తు చేసి బ్లాక్ లిస్టులో ఉంచాలని పలువురు సభ్యులు సూచించారు. సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ రాజమణి మురళీధర్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఏడవ స్థాయి సంఘ (పనలు)) 1వ స్థాయి సంఘ (ఆర్థిక, ప్రణాళిక) సమావేశాల్లో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో పాటు పలువురు జడ్పీటీసీలు పాల్గొన్నారు. జిన్నారం జడ్పీటీసీ కుంచాల ప్రభాకర్, పటాన్‌చెరు జడ్పీటీసీ గడీల శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ రోడ్లు భవనాల శాఖ ద్వారా చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. వెంటనే వాటిని వేగవంతం చేయాల్సిన అవసరం ఉన్నదని, పని చేయని కాంట్రాక్టర్ల డిపాజిట్లను జప్తు చేసి బ్లాక్‌లిస్టులో పెట్టాలని సూచించారు. గత సంవత్సరం వేసవిలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసిన వారికి బకాయి ఉన్న డబ్బులను వెంటనే విడుదల చేయాలని కోరారు. మిషన్ భగీరథ కింద ఇంట్రా పైపులైన్లు వేసి గ్రామాలకు నీటిని సరఫరా చేయాలని తెలిపారు. గ్రామాల్లో వాటర్ ట్యాంక్‌లు, సంప్‌లు శుభ్రం చేయకపోవడం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.90 వేల కరంట్ బిల్లు రావడంతో గుండెపోటుతో చనిపోయిన దిడ్గి గ్రామానికి చెందిన రైతు కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆక్రమణకు గురవుతున్న చెరువులు, కుంటలను గుర్తించి ఎఫ్‌టిఎల్ ఫిక్స్ చేసి వాటిని కాపాడాలని సభ్యులు డిమాండ్ చేశారు. బకాయి ఉన్న ఉపాధి హామీ కూలీ డబ్బులను వెంటనే విడుదల చేయించాలన్నారు. సమావేశంలో జడ్పిటిసిలు మనోహర్‌గౌడ్, సత్తయ్య, సీఈవో రవి, గణాంక అధికారి సయ్యద్ ఖరీం సాహెబ్, పర్యవేక్షకులు ఎం.జమ్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'రహదారుల నిర్మాణంలో నాణ్యత లోపిస్తే ఉపేక్షించం'

నారాయణఖేడ్: రహదారుల నిర్మాణంలో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదని ఆర్అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ ఎస్ఐ చందులాల్ అన్నారు. శనివారం నారాయణఖేడ్-దెగుల్‌వాడి, కంగ్టి-కొడబ్‌గల్ రహదారులను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. రహదారుల నిర్మాణంలో నాణ్యత పెరిగిందన్నారు. నాణ్యత ప్రమాణాలపై ప్రభుత్వం కచ్చితమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఎక్కడైన నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటున్నామన్నారు.

'పోలీసు' రగడ

- ఎమ్మెల్యేపై భగ్గుమన్న ప్రతిపక్షాలు
- చర్చనీయాంశమైన ఆంధ్రజ్యోతి కథనం
- నర్సాపూర్‌లోనే డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేయాలి
- లేదంటే ఆందోళన చేస్తాం: కాంగ్రెస్
- ఎమ్మెల్యే రాజీనామా చేయాల్సిందే : బీజేపీ నాయకులు

ఆంధ్రజ్యోతి, మెదక్/నర్సాపూర్: నర్సాపూర్ పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయం ఏర్పాటుపై శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురిత మైన జగడం కథనం జిల్లాలో సంచలనంగా మారింది. నియోజకవర్గ కేంద్రంలో కాకుండా కౌడిపల్లిలో ఏర్పాటు చేయా లంటూ సీఎం కేసీ ఆర్‌కు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి లేఖ రాయడంపై ప్రతి పక్షాలు భగ్గుమంటున్నాయి. నర్సా పూర్‌కు ఎమ్మెల్యే తీరని అన్యాయం చేస్తున్నారని, పైగా కౌడిపల్లిలో ఏర్పాటు కోసం తాను సీఎంను కోర లేదని ప్రజలను తప్పుదోవ పట్టించిన ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్లు తమ పదవు లకు రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. డీఎస్పీ కార్యాలయ సాధనకు అఖిలపక్షంతో కలిసి ఆందోళన చేపడుతామని కాంగ్రెస్ నేతలు ప్రకటించారు. అయితే వివాదంపై ఎమ్మెల్యే స్పందించారు. చిన్నపాటి పొరపాటు వల్ల అలా జరిగిందని, నర్సాపూర్‌లో ఏర్పాటు చేయాలని జూలైలో సీఎంకు వినతి పత్రం ఇచ్చినట్లు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తెలిపారు. డీఎస్పీ కార్యాలయం ముమ్మాటికి నర్సాపూర్‌లోనే ఏర్పడుతుందని ఆయన స్పష్టం చేశారు.

ఆందోళన చేస్తాం: కాంగ్రెస్ నేతలు

కొత్తగా ఏర్పాటు చేయబోతున్న పోలీసు సబ్ డివిజన్ కార్యాల యాన్ని కౌడిపల్లిలో కాకుండా నర్సాపూర్‌లోనే ఏర్పాటు చేయాలని మండల కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. కౌడిపల్లిలో ఏర్పాటు చేయాలంటూ సీఎంకు ఎమ్మెల్యే లేఖ ఇవ్వడాన్ని వారు ఖండించారు. ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశం, నర్సాపూర్ సర్పంచ్ వెంకటరమణారావు, ఇబ్రహీంబాద్ సర్పంచ్ జితేందర్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్, నాయకులు రిజ్వాన్ తదితరులు నర్సాపూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్‌పై ఎమ్మెల్యే మదన్‌రెడ్డి వివక్ష చూపుతున్నారని వారు మండిపడ్డారు. నర్సాపూర్‌కు కాకుండా తన సొంత మండలం లోనే కార్యా లయం ఏర్పాటు చేయాలని కోరడం విచారకరమన్నారు. రెండ్రోజుల క్రితం విలేకరుల సమావేశంలోనూ అబద్దాలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. ఇప్పటికైనా డివిజన్ కార్యాలయాలు డివిజన్ కేంద్రమైన నర్సాపూర్‌లో ఏర్పాటు చేయాలని, లేదంటే అన్ని పార్టీలను కలుపుకొని ఉద్యమం చేపడుతామని కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు.



నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎమ్మెల్యే రాజీనామా చేయాలి : బీజేపీ

నర్సాపూర్ మండల ప్రజలను తప్పుదోవ పట్టించిన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ రాజమణి మురళీధర్‌యాదవ్ తమ పదవులు రాజీనామా చేయాలని మండల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నర్సాపూర్‌లో మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య, ఎంపీటీసీ సురేశ్, పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, యువ మోర్చ అధ్యక్షుడు వినయ్‌తో పాటు పలువురు నాయకులు విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే తన సొంత మండలానికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే మాటలకు, చేతలకు పొంతన లేదని, ప్రజలను మభ్య పెడుతున్నారని విమర్శించారు. నియోజకవర్గ ప్రజలను మోసం చేసిన ఆయన ఎమ్మెల్యే పదవికి అనర్హుడని తెలిపారు. డీఎస్పీ కార్యాలయాన్ని నర్సాపూర్‌లో కాకుండా మరెక్కడ ఏర్పాటు చేసినా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నర్సాపూర్‌లోనే డీఎస్పీ కార్యాలయం

నర్సాపూర్‌లో డీఎస్పీ కార్యాలయం ఏర్పాటవుతుందని, ఇందులో ఎటువంటి అనుమానాలకు తావులేదని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన 'ఆంధ్రజ్యోతి ప్రతినిధి'తో ఫోన్‌లో మాట్లాడారు. చిన్న పొరపాటు వల్ల డీఎస్పీ కార్యాలయం నర్సాపూర్‌కు బదులుగా కౌడిపల్లి అని పడిందని ఆయన వివరణ ఇచ్చారు. జూలైలో తాను మరోసారి కేసీఆర్‌ను కలిసి నర్సాపూర్‌లో డీఎస్పీ కార్యాలయం, కౌడిపల్లిలో సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరానని అందుకు సంబంధించిన లేఖను 'ఆంధ్రజ్యోతి'కి మెయిల్ చేశానన్నారు. జూన్‌లో మాత్రం కౌడిపల్లిలో సబ్ డివిజన్ కార్యాలయం ఏర్పాటుకు వినతి పత్రం ఇచ్చింది నిజమేనన్నారు. తన వద్దకు నిత్యం ఎంతో మంది వస్తుంటారని, పనిఒత్తిడిలో ఇలా జరిగిందని, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా జాగ్రత తీసుకుంటానని హామీ ఇచ్చారు. నర్సాపూర్‌పై తనకు ఎలాంటి వివక్ష లేదని డీఎస్పీ సహా ఇతర డివిజన్ కార్యాలయాలన్నీ నర్సాపూర్‌లో ఏర్పాటవుతాయని తెలి పారు. నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయ మన్నారు. సీఎం సహకారంతో నియోజకర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నానని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పేర్కొన్నారు.

రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తాం

- అన్ని జిల్లాల్లో నీరందేలా చూస్తాం
- పెండింగ్ ప్రాజెక్టులకు పెద్దపీట వేస్తాం
- సింగూరు కింద 40 వేల ఎకరాలకు సాగునీరందిస్తున్నాం
- మంత్రి హరీశ్‌రావు



పెద్దశంకరంపేటలో ఆంజనేయ స్వామి శిలాఫలకం ప్రారంభిస్తున్న మంత్రి

పెద్దశంకరంపేట : తెలంగాణ ప్రాంతంలోని అన్ని జిల్లాలను సస్యశ్యామలం చేయడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర భారీనీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం పెద శంకరంపేటలోని రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద 21 అడుగుల పంచముఖి ఆంజనేయ స్వామి విగ్రహ ఆవిష్కరణ, ప్రత్యేక పూజలు చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తూ పూర్తి చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులు మంజూరు చేసినా పనులు చేపట్టలేదన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టులన్నింటిని పూర్తిచేసేలా చర్యలు చేపట్టామన్నారు. సింగూరు ప్రాజెక్టు ద్వారా ప్రస్తుత ఖరీఫ్‌లో 40 వేల ఎకరాలకు సాగునీరందిస్తున్నామని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో దశాబ్దాలనుంచి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పను లను తమ ప్రభుత్వం పూర్తి చేయిస్తుందన్నారు. మధ్య తరహా ప్రాజెక్టులను నిర్మిస్తూ రైతులకు సాగు నీరందిస్తున్నామని తెలిపారు. అన్ని జిల్లాల్లో ప్రాజెక్టులను పూర్తి చేసి చెరువులను నింపి రైతులకు సాగు నీరందించి పంటలను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో దాదాపు 7 లక్షల ఎకరాలకు నీరందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కరీంనగర్ జిల్లా మంథనిలో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పంటల సాగును అందుబాటులోకి తెచ్చామన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో మొత్తం 5 ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తి చేశామన్నారు. పంచముఖి ఆంజనేయ స్వామి ఆశీస్సులతో ఈ సారి కూడా వర్షాలు సమృద్ధిగా కురవాలని పంటలు బాగా పండి రైతులు లాభాల బాటలో పయనించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, ఆలయ వ్యవస్థాపకుడు విగ్రాం రామాగౌడ్, ఎంపీపీ రాయిని సంగమేశ్వర్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ జంగం శ్రీనివాస్, ఎంపీటీసీలు సుశీల, వేణుగోపాల్‌గౌడ్, సుభాష్‌గౌడ్, మాణిక్‌రెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షులు రాజు, సర్పంచులు గజవాడ నర్సింలు, విజయరామరాజు, అంబాబాయిభీంరావు, నాయకులు క్రిష్ణమూర్తి, కందుకూరి రవీందర్, దాదిగారి గంగాధర్, సురేశ్‌గౌడ్, గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పంచముఖి ఆంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

సినిమాలు

నర్సాపూర్	
సాయి	జయ జానకీనాయక
శ్రీనివాస	నేనేరాజు నేనే మంత్రి

రామాయంపేట	
సంతోష్	నక్షత్రం
సాయిరామ్	ఫిదా

పెద్దశంకరంపేట	
లక్ష్మి	జయ జానకీనాయక

మెదక్	
సినీమ్యాక్స్	ఫిదా
గంగినేని	నేనేరాజు నేనే మంత్రి
సాగర్	లై

పోలీస్ క్వార్టర్ల నిర్మాణం జరిగేనా ?

● అద్దెభవనాల కోసం ఆరాట పడుతున్న పోలీసులు

అల్లాదుర్గం : శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న పోలీసులు నివాసముండేందుకు అల్లాదుర్గంలో గూడు కరువైంది. శాంతి భద్రతల పరిరక్షణకోసం మండలంలో తిరిగేందుకు వాహనాలను అందించిన ప్రభుత్వం వీరు నివాసముండేందుకు క్వార్టర్లను మాత్రం నిర్మింపచేయకపోవడంతో స్థానికంగా అద్దె భవనాలు దొరకక ఆరాట పడుతున్నవైనమిది. స్థానిక పోలీస్‌స్టేషన్ కొన్ని దశాబ్దాల చరిత్ర కలిగి ఉన్నట్లు గ్రామపెద్దలు చర్చించుకుంటారు. అంతటి చరిత్ర కలిగిన ఈ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించే పోలీసులు నివాసముండేందుకు క్వార్టర్లను మాత్రం ప్రభుత్వం నిర్మించలేకపోయింది. గ్రామంలో నిజాంకాలం నాటి భవనంలో ఉన్న ఈ పోలీస్‌స్టేషన్‌ను గత ఇరువై సంవత్సరాల క్రితం 161వ జాతీయ రహదారి వద్ద నూతన పోలీస్‌స్టేషన్‌ను నిర్మించిన ప్రభుత్వం క్వార్టర్లను మాత్రం నిర్మించలేక పోయింది. ఈ స్టేషన్‌లో ఎస్ఐ, ఇద్దరు ఏఎస్ఐలు, నలుగురు హెడ్ కానిస్టేబుళ్లతో పాటు 21 మంది పోలీసులతో 29 మంది సిబ్బంది ఉన్నారు. తాజాగా సర్కిల్ కార్యాలయంసైతం ఏర్పాటు కావడంతో సీఐతో పాటు మరికొంత పోలీస్ సిబ్బంది కూడా పెరిగింది. ఈ సిబ్బంది నివాసముండేందుకు స్థానికంగా అద్దె భవనాలు దొరకకపోవడంతో వీరు ఎదుర్కొంటున్న ఇక్కట్లు వర్ణనాతీతం. అయితే పోలీస్ క్వార్టర్ల నిర్మాణం కోసం పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని సంబంధిత ఉన్నతస్థాయి అధికారులు పదేళ్లుగా పరిశీలిస్తున్నారు తప్ప వీటి నిర్మాణం కోసం అడుగులు వేయక పోవడం శోచనీయం. ఎంతో చరిత్ర కలిగిన ఈ పోలీస్ స్టేషన్ తర్వాత ఏర్పడిన పోలీస్‌స్టేషన్లలో క్వార్టర్లతో పాటు అన్ని సదుపాయాలు కల్పించిన ప్రభుత్వం ఈ స్టేషన్‌పై పట్టించుకోకపోవడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి క్వార్టర్ల నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్


నోట్‌బుక్స్‌ను పంపిణీ చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి

● కళాశాల ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్

అల్లాదుర్గం : పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం రేయింబవళ్లు శ్రమిస్తూ విద్యాభ్యున్నతి కోసం కృషి చేస్తున్న తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని అల్లాదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్ విద్యార్థులకు సూచించారు. శనివారం స్థానిక జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థుల స్వాగతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతు, విద్యార్థులు ఉన్నత చదువుల కోసం కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే చక్కటి సత్ఫలితాలు ఇస్తాయన్నారు. అనంతరం టీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బ్రహ్మం మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్నిరంగాలలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రవికుమార్, రవీందర్, శ్యామయ్య, రామచంద్రం, ప్రమోద్, సైదులు, సంధ్యారాణి, రమేష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడుగా అనీల్‌గౌడ్

అల్లాదుర్గం : ఎన్ఎస్‌యూఐ అల్లాదుర్గం మండల అధ్యక్షుడుగా కె.అనీల్‌గౌడ్‌ను నియమిస్తూ శనివారం జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నాగరాజు ప్రకటించారు. మండలంలోని గడిపెద్దాపూర్ గ్రామానికి చెందిన అనీల్ గౌడ్ విద్యార్థుల సమస్యల సాధన కోసం చేసిన సేవలను గుర్తించిన జిల్లా నాయకులు ఈయనను నియామకం చేయడంపై మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలిపారు.


కె.అనీల్‌గౌడ్

పీఆర్టీయూ మండల నూతన కార్యవర్గం


నర్సాగౌడ్, యాదవరెడ్డి

రామాయంపేట: పీఆర్టీయూ రామాయంపేట మండల నూతన కార్య వర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నర్సాగౌడ్, ప్రధానకార్యదర్శిగా యాదవరెడ్డిలు నియమితులయ్యారు. అలాగే అసోసియేట్ అధ్యక్షుడుగా శంకర్, మహిళా ఉపాధ్యక్షురాలిగా కవిత, కార్యదర్శిగా మాధవీలను నియమించడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన నర్సాగౌడ్ మాట్లాడుతూ సంఘాన్ని మరింత పటిష్టపరుస్తామన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తామన్నారు.

'పేట'లో ఫొటోగ్రఫీ దినోత్సవం

రామాయంపేట: ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని శనివారం రామాయంపేటలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఫొటోగ్రాఫర్లు శనివారం ఉదయం ఇక్కడి ప్రభుత్వ ఆస్పత్రికి ర్యాలీగా తరలివెళ్లి రోగులను పరామర్శించి పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లింగం, కర్రె నరేందర్, మధు, నర్సింలు ఉన్నారు.


పండ్లు పంపిణీ చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

వైభవంగా పంచముఖి హనుమాన్ విగ్రహ ఆవిష్కరణ

● పేటలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ
● సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం

పెద్దశంకరంపేట : పెద్దశంకరంపేటలో శనివారం పంచముఖి ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ట ఆవిష్కరణ అంగరంగ వైభవంగా భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. రాష్ట్ర భారీనీటి పారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక పూజలు చేయడంతోపాటు విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యకర్తలు దాదాపు 60 మంది సామూహికంగా 21 సార్లుహనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన హోమంలో ఆలయ ధర్మకర్త విగ్రాం లలిత రామాగౌడ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ వేణుగోపాల్‌గౌడ్ పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన ప్రముఖులందరికి మెమొంటో, శాలువాలతో ఆలయ ధర్మకర్త విగ్రాంరామాగౌడ్ సన్మానించారు. కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్, భర్దిపూర్ మహరాజ్ అవధూతగిరి మహరాజ్ తదితరులు హాజరయ్యారు.

మర్వల్లిలో దోమల నివారణ మందు పిచికారి

రేగోడు : వర్షాకాలంలో అంటు వ్యాదులు రాకుండా దోమల నివారణ మందు పిచికారి చేస్తున్నట్లు సర్పంచ్ వినోదాభూంరెడ్డి అన్నారు. శనివారం గ్రామంలో దోమల నివారణ మందు పిచికారి చేయించారు. వర్షాలకు నీరు గుంతలలో చేరి దోమలు పెరిగిపోతాయని అన్నారు.

రేగోడులో జ్వరాలు

● రోజురోజుకు పెరుగుతున్న రోగుల సంఖ్య

రేగోడు : టైఫాడ్ జ్వరాలు రేగోడును వణికిస్తున్నాయి. గత నెల రోజులుగా రేగోడులో జ్వరాలు పీడిస్తున్నాయి. జ్వరాలతో బాధపడుతూ ఆసుపత్రికి వెళితే జ్వరం అని వైద్యులు నిర్ధారిస్తున్నారు. జ్వరాలు గ్రామంలో విజృంభించాయని, వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ. వేలు ఖర్చు పెట్టి చూపించుకుంటున్నామని గ్రామస్థులు తెలిపారు. రేగోడులో ఇంటికో జ్వరం బాధితులు ఉన్నారని, వైద్యం అందకనే జ్వరాల సంఖ్య పెరుగుతుందని అన్నారు. నెల రోజులుగా జ్వరాలు పెరుగుతున్నాయని ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటుచేసి వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలలో వైద్యం అందడం లేదు : చారి

రేగోడ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యంకోసం వెళితే పట్టించుకోవడం లేదని అన్నారు. వైద్యులు అందుబాటులో ఉండరన్నారు.

వేద విద్యాలయంలో ఉపనయనం

రామాయంపేట: పట్టణంలోని వేద విద్యాలయంలో శనివారం ఉపనయనం కార్యక్రమాన్ని జరుపుకున్నారు. ఈ పాఠ శాలలో విద్యాభ్యాసం చేసేందుకు వచ్చిన 20 మందిని గురుకుల వ్యవస్థాపకులు పడకంటి సంగమేశ్వర్, ఆలయ గురువులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేదవిద్యను అభ్యసించడం తమకెంతో సంతోషాన్నిచ్చిందన్నారు. ప్రస్తుత తరుణంలో పురాతన విద్యను అభ్యసిం చేందుకు ఉత్సాహం చూపడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమయంలో తల్లిదండ్రులు పిల్లలను వేద విద్యాలయానికి పంపడం గొప్ప విషయమన్నారు. ఈ సమావేశంలో పుట్టి మల్లేశం, ఏలూరి రవీందర్, మల్లేశం, పండరినాథ్ పాల్గొన్నారు.


ఉపనయన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పురోహితుడు

'సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె'

● నాల్గో రోజుకు చేరిన ఆందోళన

మెదక్ అర్బన్: ఇందిరాక్రాంతి పథకంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మెదక్ జిల్లా మండల సమైక్య సంక్షేమసంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె శనివారం నాల్గోరోజుకు చేరింది. ఈ సందర్భంగా సమైక్య సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీనీల మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె ఆగదన్నారు. హెచ్ఆర్ పాలసీ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అంతేకాకుండా కనీస వేతనం రూ. 18,500 ప్రతినెలా సెర్ప్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు సునీత, సహాయ కార్యదర్శి ప్రదీప్, సాయిరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.


మోకాళ్లపై నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

● అల్లాదుర్గం సీఐ రవీందర్‌రెడ్డి

పెద్దశంకరంపేట: ప్రశాంత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని అల్లాదుర్గం సీఐ రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం పేట పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన మండల శాంతి సంఘం సమావేశంలో మాట్లాడారు. వినాయక చవితి సందర్భంగా మంటపాలు ఏర్పాటు చేసేవారు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. విద్యుత్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఐ విజయరావు, సర్పంచ్ జంగం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


పద్మాదేవేందర్‌రెడ్డికి పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న దృశ్యం

ఆదివరాలస్వామికి ఉప సభాపతి ప్రత్యేకపూజలు

మెదక్ అర్బన్: ఆదివరాల స్వామికి ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి ప్రత్యేకపూజలు నిర్వహించారు. శనివారం పెద్దపల్లిజిల్లా కమాన్‌పూర్ మండలంలో వెలసిన స్వామిని దర్శించుకునేందుకు వెళ్లారు. ఆలయ కమిటీ ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నారు. అలాగే ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనిని పరిశీలించారు.

విద్యార్థుల నమోదుకు గడువు పొడిగింపు

• జిల్లా విద్యాశాధికారి సరోజినీదేవి

మెదక్ అర్బన్: ఇన్‌స్పైర్ మానక్ 2017లో విద్యార్థుల నమోదుకు వచ్చేనెల 15వరకు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాధికారి సరోజినీదేవి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2016-17 విద్యాసంవత్సరంలో నమోదుకానీ పాఠశాలలకు ఇదొక అవకాశమన్నారు. ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు ప్రతీ పాఠశాలను నమోదు చేయించాలన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌కు సంబంధించి 400మంది విద్యార్థులు, 150 చదరపు అడుగుల నిర్మాణస్థలం కలిగిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 31లోగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని వారు సూచించారు.

మత్స్యకారులకు 22న అవగాహన సదస్సు

• జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మీనారాయణ

మెదక్ అర్బన్: మత్స్యపరిశ్రమ సమగ్రాభివృద్ధి పథకంలో భాగంగా జిల్లాలోని అన్ని చెరువుకుంటల్లో సరిపోను చేపపిల్లలను వందశాతం రాయితీపై సరఫరా చేస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. 22న ఉదయం 10గంటలకు చేపపిల్లల విడుదల సమయంలో మత్స్యకారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పెద్దచెరువు, కోంటూరు, మెదక్ మండల మత్స్యకారులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డిప్యూటీస్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ భారతిహోళికెరి రానున్నట్లు వెల్లడించారు.

పీఆర్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

నిజాంపేట: నిజాంపేట మండల పీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని శనివారం మెదక్ జిల్లా పీఆర్టీయూ అధ్యక్ష కార్యదర్శుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎం.గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జనార్దన్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా భానుప్రసాద్, మహిళాఉపాధ్యక్షురాలుగా రేఖలను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గంచే ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాందాస్, మహేష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్ ఉద్యోగుల నిరవధిక సమ్మె

నిజాంపేట: ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ నిజాంపేట సబ్‌పోస్టాఫీస్ పరిధిలో గల బ్రాంచ్ పోస్టాఫీస్ ఉద్యోగులు గత మూడురోజుల నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొంటున్నారని వారు తెలిపారు. నిజాంపేట పోస్టాఫీస్ పరిధిలో గల 13 మంది నిరవధిక సమ్మెతో పోస్టాఫీస్ కార్యకలాపాలు నిలిచిపోయాయి. గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, కృష్ణ, లత తదితరులు పాల్గొన్నారు.

నాగాపూర్‌లో నవగ్రహాల ప్రతిష్ఠ

హవేళీఘణపూర్: మండల పరిధిలోని నాగాపూర్ గ్రామంలోని హనుమాన్ మందిరంలో శనివారం నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.

వేతనాలు వచ్చేదెన్నడో..!

• విద్యావలంటీర్లు విధుల్లో చేరి మూడు నెలలు
• ఇంకా అందని వేతనాలు.. ఇబ్బందుల్లో వీవీలు
• భారమైన కుటుంబ పోషణ

మెదక్ అర్బన్: సర్కార్ బడుల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు ప్రభుత్వం విద్యావలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టింది. అయితే వారికి వేతనాలు సకాలంలో అందడం లేదు. దీంతో వారు దుర్భర జీవనం గడుపుతున్నారు. వారు జూన్ 12న విధుల్లో చేరారు. విధుల్లో చేరి మూడునెలలు దాటినా ఇప్పటివరకు వేతనాలు అందలేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉండడంతో విద్యార్థులకు పాఠాలు చెప్పేందుకు విద్యావలంటీర్లను నియమించారు. 2017-18 విద్యాసంవత్సరానికి నోటిఫికేషన్‌జారీకాగా 364 మంది నియమితులయ్యారు. జూన్ 12న వీరంతా విధుల్లో చేరారు. జూన్‌లో పనిచేసిన రోజులకు సంబంధించి జూలైలో వేతనాలు అందాలి. జూలైకి సంబంధించిన జీతాలు ఆగస్టు మొదటివారంలో చేతికి రావాల్సి ఉంది. కానీ ఇప్పటికీ వారికి మొదటినెల వేతనమే అందలేదు. కాగా జూన్ మాసానికి సంబంధించి విద్యావలంటీర్ల వర్క్‌డన్ వివరాలను మండల అధికారులు జిల్లా విద్యాశాఖకు పంపించారు. కానీ జూలై సంబంధించిన వివరాలు ఇంకా అందలేదని తెలుస్తోంది.

అన్ని అర్హతలు ఉన్నా..

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే విద్యావలంటీర్లకు ఉద్యోగ భద్రత కరువైంది. రెగ్యులర్ ఉపాధ్యాయులకు సమానంగా అర్హతలు ఉన్నా అవకాశాలు అందకపోవడంతో ప్రభుత్వ ఆమోదం మేరకు పాఠశాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లాలో 623 ప్రాథమిక, 131 ప్రాథమికోన్నత, 143 ఉన్నత పాఠశాలలు మొత్తం కలిపి 897 పాఠశాలలున్నాయి. కాగా ఉపాధ్యాయుల పోస్టులకు ఖాళీలకు అనుగుణంగా పాఠశాలల్లో 364 విద్యావలంటీర్లను అధికారులు రోస్టర్, మెరిట్‌ల ప్రకారం ఎంపిక చేశారు. చాలా పాఠశాలలకు విద్యావలటీర్లే పెద్దదిక్కుగా ఉన్నారు. ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్న పరిస్థితుల్లో విద్యావలంటీర్లను నియమించారు. వారికి నెలకు రూ. 12 వేల వేతనం ఇస్తారు. అవి కాస్త సకాలంలో వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు అందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.


విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న విద్యావలంటీర్

పంటల వివరాలను పక్కాగా నమోదు చేయాలి

• తహసీల్దార్ సత్యనారాయణ


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

హవేళీఘణపూర్: వ్యవసాయపంట వివరాలు పక్కాగా ఉండాలని తహసీల్దార్ సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులు, ఏఎస్‌వోలకు వ్యవసాయ పంటలసాగు గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది పంటల వివరాలను గ్రామాలవారీగా రికార్డులలో తప్పనిసరిగా నమోదు చేయాలని, వ్యవసాయ సమాచారాన్ని మార్పులను ఎప్పటికప్పుడు రైతులకు వివరించాలని సూచించారు. తప్పుడుగా సమాచారం అందిస్తే సంబంధిత సిబ్బందిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ తారాబాయి, గ్రామ రెవెన్యూ అధికారులు ఆనంద్, హుస్సేన్, ప్రకాశ్, పద్మారావు, ఏఎస్‌వో కృష్ణ, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

'కాసాని' జన్మదిన వేడుకలు

రామాయంపేట: ముదిరాజ్ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ జన్మదినం సందర్భంగా స్థానిక ముదిరాజ్‌లు వేడుకలు జరుపుకున్నారు. శనివారం ఇక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు ఆర్ పోచయ్య, పుట్టి రాజు, సార్గు లక్ష్మణ్, పుట్టి రాములు, శంకర్, పోచయ్య, అబ్రబోయిన గంగారాం, భూమ కిషన్ తదితరులు ఉన్నారు.


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ముదిరాజ్‌లు

ఘనంగా సామూహిక కుంకుమార్చన

మెదక్ అర్బన్: పవిత్రశ్రావణ మాసం పురస్కరించుకుని స్థానిక వేంకటేశ్వర ఆలయంలో మహిళలు ఘనంగా సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు పాండురంగాచార్యులు, యాదగిరిచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, అలంకరణ, సుప్రభాతసేవ తదితర విశేష పూజాకార్యక్రమాలు చేపట్టారు. అనంతరం స్వామివారి పల్లకీ సేవను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు కంచి మధుసూదన్‌తో పాటు కమిటీ సభ్యులు నాగరాజు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

• డాక్టర్ సవిత


సవిత

చిన్నశంకరంపేట: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు సవిత సూచించారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వర్షా కాలంలో వ్యాధులు ప్రబలే అవకాశాలుంటాయన్నారు. ఈ సమయంలో ప్రజలు వేడిచేసి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. నిత్యావసరాలకు ఉపయోగించే సంపులను శుభ్రంగా ఉంచాలన్నారు. ఫ్రైడే డ్రైడేగా వారానికోరోజు తప్పనిసరిగా నీటిశుభ్రత పాటించాలన్నారు. దోమ తెరలను సైతం ఉపయోగించినట్లయితే వైరల్‌ఫీవర్ రాకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. ప్రస్తుతం ప్రాథమికచికిత్స చేస్తున్నసంఖ్యలో సుమారు పదిశాతం వైరల్ ఫీవర్స్ బారీన పడిన వారున్నారన్నారు. ప్రజలు పరిశుభ్రత పాటించి సీజనల్ వ్యాధుల నుంచి కాపాడుకోవాలన్న బాధ్యతగా పరిసరాల్లోని మురుగు కూపాలను, ఇతర ప్రాంతాలను శుభ్రంగా ఉంచే విధంగా చూసుకోవాలని కోరారు.

ఈ-పాస్ విధానంతో నిత్యావసర సరుకుల పంపిణి

• తహసీల్దార్ సత్యనారాయణ

హవేళీఘణపూర్: ఈ -పాస్ విధానంతో నిత్యావసర సరుకులు ఈనెల నుంచే పంపిణీ చేస్తున్నామని తహసీల్దార్ సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కూచన్ పల్లి గ్రామంలోని రేషన్ దుకాణంలో ఈ-పాస్ విధానం ద్వారా రేషన్ సరుకుల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ- పాస్ విధానం బోగస్ కార్డుల ఏరివేతకు సహకరిస్తుందని, లబ్ధిదారులకే నేరుగా సరుకులు అందుతాయన్నారు. సిగ్నల్స్‌సమస్యను అర్థం చేసుకొని వినియోగదారులు తీసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేందర్‌రెడ్డి, వీఆర్‌వో పద్మారావు, రేషన్‌డీలర్ల మండల అధ్యక్షుడు సుధాకర్, జగపతి, దేవాగౌడ్ రమేష్ గ్రామస్థులు పాల్గొన్నారు.


ఈ-పాస్ విధానాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

డబుల్ ఇళ్ల నిర్మాణానికి స్థలం కేటాయింపు

కౌడిపల్లి: మండలంలోని తునికి గ్రామ శివారులో సర్వే నెంబరు 245లో డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణం కోసం రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించారు. శనివారం ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీశైలం మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తునికి గ్రామ శివారులోని సర్వే నెంబరు 245లో రెండు ఎకరాల స్థలాన్ని డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించినట్లు తెలిపారు. తునికి గ్రామంలోని అర్హత ఉన్న లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఆ గ్రామ వీఆర్‌వో మల్లేశానికి అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

'అందరూ మరుగుదొడ్లు నిర్మించుకోవాలి'

చిలప్‌చెడ్: ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు నిర్మించుకోవాలని తహసీల్దార్ సాదత్ అన్నారు. శనివారం మండలంలోని చిట్కూల్ గ్రామంలో మరుగుదొడ్ల నిర్మాణంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మరుగుదొడ్ల నిర్మాణం కార్యక్రమం చేపట్టిందని, అందరూ మరుగుదొడ్లు నిర్మించుకోవాలన్నారు. గ్రామంలో మరుగుదొడ్లు లేని వారికి ప్రభుత్వ పథకాలను ఆపివేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాయమ్మ, ఎంపీటీసీ శేఖమ్మ, కార్యదర్శి మహేందర్, నగేశ్, వీఆర్‌వో ఎల్లయ్య, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంజన్న ఆలయంలో భక్తుల సందడి

శివ్వంపేట: శ్రావణమాసం పురస్కరించుకొని శనిత్రయోదశి సందర్భంగా మండలంలోని చిన్నగొట్టిముక్ల పంచాయతీ చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శనివారం తెల్లవారుజామునుంచే భక్తులు పలు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నవగ్రహాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తైలాభిషేకం నిర్వహించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ఆవరణం కిక్కిరిసిపోయి సందడిగా మారింది. అదేవిధంగా జడ్పీటీసీ కమలాపూల్‌సింగ్ స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

సర్పంచ్‌పై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం

నర్సాపూర్: నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ సర్పంచ్ వెంకటరమణారావుపై కొందరు ఆకతాయిలు సోషల్ మీడియాలో అసభ్యకరంగా తప్పుడు ప్రచారం చేస్తూ పోస్టులు చేశారు. ఈ విషయాన్ని గుర్తించిన సర్పంచ్ తనను కావాలని సోషల్ మీడియాలో ఆందోళనకు గురి చేయడానికి ఈ విధంగా పోస్టు చేశారని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'గ్రామస్థాయి రెవెన్యూ సిబ్బందిని వ్యవసాయ శాఖలో విలీనం చేయొద్దు'

నర్సాపూర్: రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ శాఖ గ్రామస్థాయి సిబ్బందిని వ్యవసాయ శాఖలో విలీనం చేసే ఆలోచనను ఉపసంహరించుకోవాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం అధ్యక్షుడు పెంటయ్య, అశోక్, లక్ష్మయ్య, రఘుపతి, సుదర్శన్, సత్తయ్య, శ్రీరామ్‌తదితరులున్నారు.

వర్షాలు కురవాలని పూజలు

చిలప్‌చెడ్: మండలంలోని జగ్గంపేట్ గ్రామంలో వర్షాలు కురవాలని గ్రామస్థులు సామూహికంగా హనుమాన్ ఆలయంలో శివుడికి, హనుమాన్ విగ్రహాలకు జలాభిషేకం నిర్వహించారు. గత ఏడాది ఈ విధంగా చేయడంతో వర్షాలు సంవృద్ధిగా కురిశాయని, ఈసారి కూడా కురుస్తాయన్న నమ్మకంతో పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో బి.ప్రభు, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సిద్దాగౌడ్, తులసీదాస్, యాదాగౌడ్, పోచయ్య, నీరుడిబిక్షపతి, హన్మంతు, పద్మశివచారి, కుమ్మరి దేవదాసు తదితరులున్నారు.

చెక్‌పోస్టును తనిఖీ చేసిన ఏఎంసీ చైర్మన్

జోగిపేట: జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ నాగభూషణం శనివారం మార్కెట్ పరిధిలోని శివంపేట చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టులోని రిజిస్టర్లను, రికార్డులను ఆయన పరిశీలించారు. అంతకు ముందు చెక్‌పోస్ట్ సిబ్బందిని ఆ దారి గుండా వెళ్లే వాహనాలలో తరలించే సరుకుల వివరాలను, చెల్లించే మార్కెట్ సెస్సు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ శ్రీధర్, టీఆర్ఎస్ నగర పంచాయతీ శాఖాధ్యక్షుడు వెంకటేశం పాల్గొన్నారు.

సమ్మె విరమించేది లేదు

హత్నూర: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించుకోవాలని కోరుతూ మండలంలోని ఆయా గ్రామాల పోస్టల్ శాఖ ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. దీంతో ఆయా గ్రామాలకు పోస్టల్ శాఖ ద్వారా వచ్చే కార్యకలాపాలు నిలిచిపోయాయి. ప్రభుత్వం దిగి వచ్చి తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు.

రెవెన్యూ సవరణను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



రెవెన్యూ గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

శివ్వంపేట: రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు రికార్డులను సవరణ చేయాలన్న ఉద్దేశంతో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఎమ్మెల్యే కొంతాన్‌పల్లి గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎకరాకు రూ.4వేలు అందజేసే పథకంలో తప్పుడు రికార్డులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో రెవెన్యూ సవరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు కొంతాన్‌పల్లిలో ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డి.చంద్రాగౌడ్, పీపీసీఎస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, టీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ సుధీర్‌రెడ్డి, తహసీల్దార్ యునూస్, ఇన్‌చార్జి ఆర్ఐ నర్సింగ్‌యాదవ్, సర్పంచ్ ఇందిరాశ్రీనివాస్, ఉపసర్పంచ్ నాగేశ్వర్‌రావు, వీఆర్‌వోలు, రైతులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

శ్రావణమాసం పురస్కరించుకొని శివ్వంపేట మండలంలోని చిన్నగొట్టిముక్ల పంచాయతీ చాకరిమెట్ల ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌యాదవ్, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, టీఆర్ఎస్ నాయకులు అశోక్‌గౌడ్, అర్జున్ తదితరులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు. శనిత్రయోదశి సందర్భంగా నవగ్రహాలకు నువ్వులనూనెతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థుల మార్గదర్శకులు ఉపాధ్యాయులే

● డీఈవో సరోజినీ దేవి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో సరోజినీ దేవి

శివ్వంపేట: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే మార్గదర్శకులని వారికి మంచి క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని మెదక్ జిల్లా విద్యాధికారి సరోజినీదేవి అన్నారు. మండల కేంద్రమైన శివ్వంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆమె సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి హిందీ పాఠాలను చదివించారు. పాఠశాలలో బోధనవివరాలు, మధ్యాహ్న భోజనం, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బుచ్యానాయక్, ఇన్‌చార్జి హెచ్ఎం నారాయణమ్మ, పిజికల్ డైరెక్టర్ గంగాల రమేశ్ తదితరులున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంపై ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని డీఈవో సరోజినిదేవి అన్నారు. మండల కేంద్రమైన శివ్వంపేట ఎంపీడీవో కార్యాలయంలో స్వార్డ్ సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛపాఠశాల-స్వచ్ఛతెలంగాణ ప్రణాళికపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా డీఈవో హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్వార్డ్ సంస్థ సెక్రటరీ శివకుమారి, ఆర్గనైజర్లు లక్ష్మణ్, భానుప్రియా, సాల్మాన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

● స్కూల్ ఆవరణలో కూలడానికి సిద్ధంగా ఉన్న వాటర్ ట్యాంక్
● పట్టించుకోని అధికారులు, నాయకులు
● బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు



పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న వాటర్ ట్యాంక్ (రాడ్లు తేలిన పిల్లర్)

నర్సాపూర్‌రూరల్: వాటర్ ట్యాంక్ పూర్తిగా శిథిలావస్థకు చేరి అత్యంత ప్రమాదకరంగా మారింది. మండలంలోని ఖాజీపేట గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు అత్యంత సమీపంలో ఈ ట్యాంక్ ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. వాటర్ ట్యాంక్ పిల్లర్లు పూర్తిగా పెచ్చులూడి, రాడ్లు కూడా బయటకు తేలి అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ ట్యాంక్ వల్ల ఎటువంటి ఉపయోగం లేదు. ట్యాంక్ ప్రమాదకరంగా ఉందని, కూల్చి వేయాలని స్థానికులు కొన్ని సంవత్సరాలుగా కోరుతున్నా.. పట్టించుకునే వారు లేరు. దీంతో ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

పూరిగుడిసెలోనే వంట

ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండటానికి వంటశాల నిర్మిస్తున్నామని అధికారులు, పాలకులు గొప్పలు చెప్పుకుంటున్నా, ఖాజీపేట పాఠశాలలో నేటికీ పూరిగుడిసెలోనే వంట చేస్తుండటం విశేషం. వర్షం వస్తే మాత్రం ఇక అంతే సంగతులు.

కాంపౌండ్‌వాల్ లేక ఇబ్బందులు

పాఠశాలకు కంపౌండ్‌వాల్ లేక పాఠశాల ఆవరణలో పశువులు, పందులు స్వైరవిహారం చేస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

చిరుజల్లులతో పంటలకు జీవం

కౌడిపల్లి: కొన్ని రోజులుగా కురుస్తున్న తుఫాను వర్షాలు ఆరుతడి పంటలకు జీవం పోస్తున్నాయి. వర్షాలు లేక ఎండిపోయిన ఆరుతడి పంటలకు ప్రాణం పోశాయి. కౌడిపల్లి మండల పరిధిలోని 17పంచాయతీల్లో 8వేల ఎకరాల్లో మొక్కజొన్న, మినుము, పెసర, వేరుశనగ, కంది తదితర పంటలను వేశారు. నష్టాలను చూస్తున్న రైతులకు ఈ వర్షాల కారణంగా ఊపిరి పీల్చుకున్నారు. భూగర్భ జలాలు అంతరించడంతో ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపిన రైతులు నేడు తుఫాను వర్షాల కారణంగా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వేసిన పంటలు ఏపుగా పెరుగుతున్నాయని, తాము అనుకున్న లాభాలు వస్తాయన్న ధీమాతో ఉన్నారు.



వెల్మాకన్నలో ఏపుగా పెరుగుతోన్న మొక్కజొన్న పంట



నర్సాపూర్‌లో కురుస్తున్న వర్షం

ఎడతెరిపి లేకుండా వర్షం

నర్సాపూర్: నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్‌లో శనివారం మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. మధ్యాహ్నం 2గంటల నుంచి 7గంటల వరకు ఓ మోస్తరుతో కూడిన జల్లులు పడ్డాయి. శనివారం కురిసిన వర్షం స్థానిక రైతులకు కొంత ఊరటనిచ్చిందని చెప్పవచ్చు. పట్టణంలో మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు.



వెంకటేశ్వర టాకీస్
లై

ఇస్లాంపూర్, గుండ్రెడ్డిపల్లిలో ఎవెన్యూ ప్లాంటేషన్





గుండ్రెడ్డిపల్లి, ఇస్లాంపూర్‌లో ఎవెన్యూ ప్లాంటేషన్‌లో పాల్గొన్న గడ ఎంపీడీవో జయదేవ్, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, ఎంపీపీ శ్రీనివాస్

తూప్రాన్: మండలంలోని ఇస్లాంపూర్, గుండ్రెడ్డిపల్లిలో శనివారం హరితహారంలో కార్యక్రమంలో ఎవెన్యూ ప్లాంటేషన్ చేపట్టారు. ఇస్లాంపూర్, గుండ్రెడ్డి పల్లి గ్రామాల్లో ఎవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గడ ఎంపీడీవో జయదేవ్, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, ఎంపీపీ శ్రీనివాస్ హాజరై ఎవెన్యూ ప్లాంటేషన్ ప్రారంభించారు. గ్రామంలో మొక్కలను నాటి రక్షణగా ట్రీగార్డులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నరేందర్‌రెడ్డి, రేణుక తది తరులు పాల్గొన్నారు. గుండ్రెడ్డిపల్లిలో చేపట్టిన ప్లాంటేషన్‌లో జాతీయ అక్షరాస్యత మిషన్ తరుపున మల్కాపూర్ పరిశీలనకు వెళుతున్న పునె యూనివర్సీటీకి చెందిన డా. రోహిణి సుధాకర్, సాక్షరభారత్ డీప్యూటీ డైరక్టర్ ఉషామార్త స్వర్ణలత, ఈవోపీఆర్డీ రాఘవరావు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వీఆర్‌ఏలు

రెవెన్యూశాఖ గ్రామస్థాయి సిబ్బందిని

వ్యవసాయశాఖలో విలీనం చేయొద్దు

- తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన వీఆర్‌ఏలు

వెల్దుర్తి: రెవెన్యూశాఖ గ్రామస్థాయి సిబ్బందిని వ్యవసాయశాఖలో విలీనం చేయవద్దని జిల్లా వీఆర్‌ఏ సంఘం అధ్యక్షుడు పోచయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా గ్రామాల్లో కీలకంగా పనిచేస్తున్నామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేసినప్పుడు కూడా తమ వంతు కృషి చేశామని గుర్తుచేశారు. . రెవెన్యూశాఖ ద్వారానే ఎలాంటి ప్రభుత్వపనులైనా ఎప్పటికప్పుడు చేస్తున్నామన్నారు. అలాంటి తరుణంలో తమను వ్యవసాయశాఖలో విలీనం చేయడమెందుకని, ఆ చర్యలను వెంటనే ప్రభుత్వం విరమించుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీనివాస్‌తో పాటు ఆయా గ్రామాల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

వైకుంఠధామ నిర్మాణానికి భూమిపూజ



బీకొండాపూర్‌లో వైకుంఠధామ నిర్మాణానికి ఏర్పాట్లు

చేగుంట: మండలంలోని బీకొండాపూర్ గ్రామంలో వైకుంఠధామ నిర్మాణానికి శనివారం భూమిపూజ నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బీకొండాపూర్‌లోని ప్రభుత్వ స్థలంలో వైకుంఠధామ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ప్రభుత్వం అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ నిధులతో వైకుంఠధామాలను నిర్మిస్తుందని మండల ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనిల్‌కుమార్, గ్రామ నాయకుడు రాజిరెడ్డి, కార్యదర్శి శివ, గ్రామస్థులున్నారు.

చెరువుకట్టపై ఈత మొక్కల పెంపకం

మూడో విడత హరితహారం కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని బికొండాపూర్‌లోని చెరువకట్టపై ఈత మొక్కలను నాటారు. మండలం మొత్తం మీద 10 లక్షల 80వేల మొక్కలను నాటాల్సి ఉండగా 6లక్షల పైచిలుకు మొక్కలను నాటామని, సెప్టెంబర్ 15 నాటికల్లా టార్గెట్‌ను పూర్తి చేయనున్నట్లు తెలిపారు.



చెరువు కట్టపై ఈతమొక్కలు నాటుతున్న దృశ్యం

ఫొటోగ్రాఫర్లకు ఘనంగా సన్మానం





ఫొటోగ్రాఫర్లను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్, వాసవిక్లబ్ సభ్యులు

చేగుంట: అంతర్జాతీయ ఫొటోగ్రఫి దినోత్సవం పురస్కరించుకొని చేగుంట లయన్స్‌క్లబ్, వాసవిక్లబ్‌ల ఆధ్వర్యంలో ఫొటోగ్రాఫర్లను శనివారం ఘనంగా సన్మానించారు. మండలకేంద్రమైన చేగుంటలోని కృష్ణవేణి పాఠశాల ఆవరణలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో, స్థానిక శుభమస్తు ఫంక్షన్‌హాల్‌లో వాసవిక్లబ్ ఆధ్వర్యంలో ఫోటోగ్రాఫర్లను సన్మానించారు. కాలగర్భంలో కలిసిన చరిత్రకు సజీవ రూపమే ఫొటో అని పలువురు వక్తలు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వీరబ్రహ్మం, వాసవిక్లబ్ అధ్యక్షుడు పరంజ్యోతి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, లింగమూర్తి, రాంరెడ్డి, మునిగాల వేణు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ దినోత్సవ ర్యాలీ

అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలకేంద్రమైన చేగుంటలో ఫొటోగ్రాఫర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. ఫొటోగ్రాఫర్లకు జీవన భృతి కల్పించాలని కోరుతూ స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి గాంధీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. చౌరస్తాలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెల్‌ఫోన్ల వల్ల తమ ఉపాధి అవకాశాలు చాలా దెబ్బతిన్నాయని, తమని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు నర్సింహాగౌడ్, బాబు, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు గొర్రెల పంపిణి



గొర్రెలను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి శ్రీనివాస్

చేగుంట: మండలంలోని పలు గ్రామాలకు చెందిన గొల్లకుర్మలకు సబ్సిడీ గొర్రెలను అందజేశారు. కర్నూల్ జిల్లా నుంచి తీసుకువచ్చిన గొర్రెలను పశువైద్యాధికారి శ్రీనివాస్ లబ్ధిదారులకు అందజేసి వాటి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. చందాయిపేట, గొల్లపల్లి, చెట్లతిమ్మాయిపల్లి, బోనాల గ్రామాలకు చెందిన 141 లబ్ధిదారులకు 21 గొర్రెల చొప్పున అందజేశారు. చందాయిపేటకు చెందిన కొమురయ్యకు అందించిన గొర్రెలు రెండు ఈనగా అదనంగా వచ్చిన రెండు గొర్రె పిల్లలతో రైతు కొమురయ్య సంతోషించాడు. తెలంగాణ ప్రభుత్వం గొల్లకుర్మల అభివృద్ధికి సబ్సిడీపై అందజేస్తున్న గొర్రెలను అందరూసద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి శ్రీనివాస్ సూచించారు.

‘చెట్లగౌరారంను పంచాయతీగా ప్రకటించాలి’

మనోహరాబాద్ (తూప్రాన్): చెట్లగౌరారంను నూతన పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మనోహరాబాద్ మండలం రంగాయపల్లి పంచాయతీ పరిధి చెట్లగౌరారంను నూతన పంచాయతీగా చేయాలని కోరారు. చెట్లగౌరారంలో 900 జనాభా. 550 ఓటర్లు ఉన్నట్లుగా ఎంపీ ప్రభాకర్‌రెడ్డి వివరించారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మెను విరమించం

- మెదక్ డివిజన్ అధ్యక్షుడు మల్లయ్య

తూప్రాన్: గ్రామీణ తపాల ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం మెదక్ డివిజన్ అధ్యక్షుడు యు. మల్లయ్య పేర్కొన్నారు. శనివారం డివిజన్ కార్యదర్శి ఆంజయ్యతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. నాల్గు రోజులుగా సమ్మె చేస్తున్న కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మెను విరమించే ప్రసక్తి లేదన్నారు. ఈనెల 21న సోమవారం మెదక్‌లో తపాల ఉద్యోగులతో పెద్దఎత్తున ర్యాలీలు, ధర్నాలు చేయనున్నట్లు ఆయన తెలిపారు.



తూప్రాన్‌లో సమ్మె చేస్తున్న తపాలా ఉద్యోగులు

నిలిచిపోయిన తపాలా సేవలు

వెల్దుర్తి: గ్రామీణ తపాలా ఉద్యోగులు సమ్మె బాట చేపట్టడంతో తపాలా సేవలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ డాక్ సేవకులు తమ డిమాండ్ల సాధన కోసం అఖిలభారత గ్రామీణ తపాలా ఉద్యోగసంఘం పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిరవధిక సమ్మె నిర్వహిస్తుండడంతో మండలంలోని తపాలా సేవలు నిలిచిపోయాయి. ఆసంఘం నాయకుడు మజార్ మాట్లాడుతూ గ్రామీణ తపాలాలో ఉద్యోగులుగా చాలీచాలని వేతనాలతో వెట్టిచాకిరి చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలన్నారు.

వర్షంతో రైతుల్లో హర్షం

వెల్దుర్తి: మండలంలో గురువారం ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులుగా వర్షాలు లేక పంటలు ఎండు దశకుచేరుకున్న తరుణంలో మూడురోజులుగా చిరుజల్లులతో కూడిన వర్షం కురుస్తుండడంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఆరుతడి పంటలు చేతికందుతాయని ఆనందం వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్

సత్యనారాయణకు అవార్డు ప్రదానం



ఎంపీ కవిత నుంచి అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ

రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో సంగారెడ్డి జిల్లా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ ఎం.సత్యనారాయణ ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా ఎంపికైన విషయం తెలిసిందే. ఈ మేరకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శనివారం ఆయన ఎంపీ కవిత చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం, పర్యాటక, భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో నిర్వహించిన పోటీల్లో ఆయన ఫొటో బహుమతికి ఎంపికైంది.

వర్షం.. సంబురం



అక్కన్నపేట మండలం చౌటపల్లిలో నీట మునిగిన వరి పైరు

సిద్దిపేట రూరల్/అక్కన్నపేట/హుస్నాబాద్ : సిద్దిపేట జిల్లాలో శనివారం పలుచోట్ల కురిసిన వర్షం చాలామంది రైతులకు ఉరటనిచ్చింది. కొన్నిచోట్ల మాత్రం పంటలు నీటమునిగాయి. సిద్దిపేట మండలంలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు 6.02మీ.మీ వర్షం కురిసింది. అక్కన్నపేట మండలంలో కురిసిన భారీ వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో వరి, పత్తి పంటలు నీట మునిగాయి. పలు కుంటలు, చెరువుల్లోకి వరద నీరు వచ్చి చేరింది. హుస్నాబాద్ మండలంలో ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. హుస్నాబాద్‌లోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. పట్టణంలోని హన్మకొండ ప్రధాన రహదారి చెరువును తలపించింది. వాహన రాకపోకలు నిలిచిపోయాయి.



జలమయమైన హుస్నాబాద్ పట్టణంలోని హన్మకొండ ప్రధాన రహదారి



వర్షంలో రోడ్డుపై వెళ్తున్న మహిళలు



సిద్దిపేట రైతు బజారులో గొడుగుల సాయంతో వచ్చిన వినియోగదారులు







1. అంతర్జాతీయ తెలుగు మహాసభలో ప్రదర్శన ఇస్తున్న దేవదాసు కళాబృందం (ఫైల్)

2. మంత్రి హరీశ్‌రావుతో దేవదాసు కళాబృందం (ఫైల్)

3. దేవదాసును ప్రశంసిస్తున్న సినారే (ఫైల్)

జాంబవంతుడి వారసత్వం..

యక్షగానానికి ప్రాణం

యక్షగానం అంటే ఆయనకు ప్రాణం. తండ్రి కళను బతికించాలనేది ఆయన కల. అది నేరవేర్చుకున్నాడు. హార్మోనియం మోగిస్తూ.. తబలా వాయిస్తూ.. తాళాలు కొట్టడం ఆయనకు మహా ఇష్టం. వారసత్వంగా వచ్చిన కళలో చిన్నప్పుడే అరంగేట్రం చేసి అందరి అభిమానాలు చూరగొన్నాడు. బాల్యంలో ప్రహ్లాదుడిగా, శిరియాలుడిగా, లవకుశలుగా అదరగొట్టేవాడు. తర్వాత రావణుడు, మైరావణుడు, అభిమన్యుడు, నారదుడి వంటి వైవిధ్యమైన పాత్రల్లో జీవించాడు. ఆయన నాటకాలు చూసిన వారి గుండెల్లో పదిలమైన స్థానం సంపాదించుకున్నాడు. యక్షగాన కళకు జీవం పోస్తున్న ఆ కళాకారుడే పిల్లుట్ల దేవదాసు. తెలంగాణ సంప్రదాయ కళల్లో ఒకటైన యక్షగానానికి నేటికీ జీవం పోస్తూనే ఉన్నాడు. చిందుకళాకారుల్లో తనకుంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాడు. ప్రస్తుతం ప్రభుత్వ సంక్షేమ పథకాలను తన కళతో ప్రచారం చేస్తున్నాడు. ఈ కళ గురించి ఎన్నో ఆసక్తికరమైన విషయాలు దేవాదాసు మాటల్లోనే..

- సిద్దిపేట రూరల్





- పిల్లుట్ల దేవదాసు, యక్షగాన కళాకారుడు

నా కల నేరింది

మా నాన్న గర్వపడేలా నేను చిందు కళా యక్షగానాన్ని ప్రదర్శించాలనుకున్నాను. ఆ కల నెరవేరింది. నేను సమాజంలో కళాకారునిగా ఎదగడానికి అప్పటి జానపద కళాకారులు ఎస్.ప్రభాకర్, రసమయి బాలకిషన్, చీకోటి కృష్ణన్న, కళా రాజేశ్ తదితరులు నాకు సహకరించారు. వారిని ఎప్పటికీ మర్చిపోను. తెలంగాణ ప్రభుత్వం యక్షగాన కళాకారులను గుర్తించి ప్రత్యేక సంక్షేమ పథకాలు అంంచాలి.

- చిన్నతనం నుంచే చిందు యక్షగానంలో రాణిస్తున్న పిల్లుట్ల దేవదాసు
- తండ్రి అబ్బసాయిలే ఆదర్శం
- సుమారు 20 వేలకు పైగా నాటకాల ప్రదర్శన
- మైరావణుడు పాత్ర ఆయనకెంతో ఇష్టం
- పలు అవార్డులతో ప్రముఖుల సత్కారం
- అనేక రాష్ట్రాల్లో ప్రదర్శనలు
- తెలంగాణ ఉద్యమంలో కళల ద్వారా తనవంతు సాయం
- యక్షగానానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ఇప్పటికీ కృషి

మా జాతిని చిందుకళాకారులుగా పిలుస్తారు. అప్పట్లో ముఖానికి రంగులు వేసుకుంటూ, వేషాలు వేస్తూ రంగస్థలంపై విభిన్న పాత్రలకు జీవం పోసేవాళ్లం. ప్రేక్షకుల మనసులు దోచుకుంటూ చిందు కళను ప్రదర్శించాం. రాత్రి పూట వీధుల్లో కళా ప్రదర్శనలు ఇవ్వడం మా వంశస్తుల ఆనవాయితీ. ఇంకా అలానే కొనసాగుతూనే ఉంది. గ్రామ ప్రజలు ఇచ్చే సంభావన (ఆర్థిక సాయం, ధాన్యం)తో బతుకు వెళ్లదీసుకునేవాళ్లం. శశిరేఖా పరిణయం, వల్లీరాణి, సత్యాహరిశ్చంద్ర, సతీ అనసూయలాంటి సాంఘిక పౌరాణిక నాటకాలను యక్షగానం ద్వారా ప్రదర్శించేవాళ్లం. ప్రతిపాత్రకు జీవం పోసేవాళ్లం. చూసే వాళ్ల నుంచి ప్రశంసలు పొందేవాళ్లం. నా చిన్నప్పుడు నాటకాలు వేసినప్పుడు ప్రజలు ఎంతగానో ఇష్టపడి చూసేవారు. ఈ రోజుల్లో అందరూ టీవీ సీరియల్స్‌కు అలవాటు పడ్డారు. ప్రస్తుతం యక్షగానం ప్రదర్శిస్తే ఆ నాటి వారు తప్ప నేటి యువత చూస్తారనుకోవటం భ్రమే.

మా నాన్న గురించి అందరికీ తెలుసు

సిద్దిపేట పట్టణ పరిధిలోని ఇమాంబాద్ గ్రామానికి చెందిన పిల్లుట్ల అబ్బసాయిలు అంటే సిద్దిపేట, కరీంనగర్, వరంగల్ జిల్లాలో తెలియని వారుండరు. ఆయనే మా నాన్న. అప్పట్లో వీధి నాటకాలల్లో మేటేశం వేయాలన్నా, ఆ వేశానికి తగ్గ పాటలు, పద్యాలు చెప్పడం, గంభీరమైన గొంతుతో మాట్లాడటం మా నాన్నకే సాధ్యం. అనేక సందర్భాల్లో ఇతర జిల్లాల్లోకి వెళ్లి ఇతరుల నాటకాల్లో అబ్బసాయిలు రంగస్థలంపై నటించిన సంఘటనలున్నాయి. పిల్లుట్ల లక్ష్మి - అబ్బసాయిలు దంపతులకు మేము ఎనిమిది మంది సంతానం. 1970లో నేను మొదటి సంతానంగా జన్మించాను. పెద్ద కుమారుడిని కావడంతో తండ్రి బాటనే ఎంచుకున్నాను. అదే గ్రామంలో ఐదోతరగతి వరకు, సిద్దిపేట ప్రభుత్వ బాలుర పాఠశాలలో పదో తరగతి వరకు చదివాను. చదువుకుంటున్నప్పుడే మా నాన్న వేసే నాటకాలల్లో తాళాలు, తబలా, హార్మోనియం వాయించేవాడిని. నాటకాలపై నాకున్న ఆసక్తిని గమనించిన మా నాన్న తెల్లవారుజామున 4గంటలకే లేపి పాటలు, పద్యాలు కంఠస్తం చేయించే వారు. వీధి నాటకాల్లో ప్రహ్లాదుడు, శిరియాలుడు, లవకుశులు వంటి పాత్రలు పోశించాను. తదనంతరం ప్రధాన పాత్రలు రావణుడు, మైరావణుడు, అభిమన్యుడు, నారదుడు వంటి మేటి వేశాలు వేసి ప్రజల మెప్పు పొందాను. నేను వేశంతో ప్రదర్శన ఇచ్చినప్పుడు ప్రజల నుంచి వచ్చిన ఆదరణ, అభిమానం చూశాక నాన్నగారి సంప్రదాయ(కుల వృత్తి) కళను బతికించాలనే తపన నాలో రేకెత్తింది.

అన్ని వర్గాల నుంచి ఆదరణ

మేము దళిత వాడలతో పాటు అంతటా యక్షగాన ప్రదర్శనలు ఇచ్చేవాళ్లం. నా చిన్నప్పటి నుంచి ఏ గ్రామంలో నాటకం వేసినా గ్రామంలోని కచ్చీరు (గ్రామ పంచాయతీ వద్ద)కాడనే ఆడెటోళ్లం. దళితుల ఇంట్లో ఏదైనా శుభాకార్యాలు ఉన్నప్పుడు వారు ప్రత్యేకంగా నాటకం ఆడమని చెప్పేవారు. అలా ఎక్కువగా మేము నాటకాలు దళితవాడల్లో వేసేవాళ్లం. అలా అని కేవలం ఆ వాడలకే మేము పరిమితం కాలేదు. మా నాటకాలకు అంతటా సంపూర్ణ మద్దతు లభించింది. అన్ని కులాల వారు అధిక సంఖ్యలో వచ్చి నాటకాలు తిలకించేవారు. మిగతా కళారూపాలతో పోలిస్తే యక్షగానానికి ప్రత్యేక ఆదరణ ఉంది. ఇది గ్రేడ్‌వన్‌లో ఉంది. జాంబవంతుని వారసత్వంగా వచ్చిన కళ ఇది. నాటకాల నుంచి సినిమాలు వచ్చినట్లుగా.. యక్షగానం నుంచే బుర్ర కథ, ఒగ్గు కథ, హరి కథలు పుట్టుకొచ్చాయి. కొత్తగా యక్షగాన కళ నేర్చుకోవాలంటే అక్షర జ్ఞానం ఉండాలి. కళపై అభిమానం ఉండాలి. ఆసక్తి ఉండాలి. తెలంగాణ ప్రభుత్వం కళలు, కళాకారులను బాగా ప్రోత్సహిస్తోంది. కళాకారులను గుర్తించి ఉద్యోగం ఇచ్చింది. సాంస్కృతిక సారథిలో భాగంగా యక్షగాన కళాకారుల్లో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15మందికి ఉద్యోగం వచ్చింది. ఈ విషయంలో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, సాంస్కృతి సారధి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, దేశపతి శ్రీనివాసులకు నా కృతజ్ఞతలు. యక్షగానానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. తెలుగు విశ్వవిద్యాలయంలో యక్షగానం శిక్షణ తరగతులు నిర్వహించేందుకు పాటుపడుతోంది. భవిష్యత్తులో యక్షగానం ఓ కొత్త కళగా, ఆసక్తికరంగా ఉంటుందని నా వ్యక్తిగత అభిప్రాయం.

ఎల్లలు దాటిన ప్రదర్శనలు

యక్షగాన ప్రదర్శనలను తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడులోని మద్రాసు, మహారాష్ట్రలోని నాగ్‌పూర్, ముంబై, రాజస్థాన్, హరియాణ, భూపాల్ తదితర ప్రాంతాల్లో ప్రదర్శనలిచ్చారు. తిరుపతిలో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలల్లో యక్షగాన కళాప్రదర్శన ఇచ్చాను. కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా ఏర్పాటు చేసి కళా ప్రదర్శనలల్లో నేను ప్రదర్శించిన యక్షగానానికి మొదటి బహుమతితో పాటు రూ.10 వేల రివార్డు దక్కింది.

రసమయి బాలకిషన్‌తో

1990లో వయోజన విద్యపై అప్పటి ప్రభుత్వం మంజీర అక్షర ప్రభ అనే పథకాన్ని ప్రవేశ పెట్టింది. అప్పటికే జానపద కళాకారునిగా గుర్తింపు పొందిన ఏర్పుల బాలకిషన్ (ప్రస్తుతం మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్) ఏర్పాటు చేసిన రసమయి జానపద కళా సంస్థలో చేరి సుమారు పది సంవత్సరాల పాటు పని చేశా. అనంతరం మేమే స్వయంగా శ్రీసత్య కళా నాట్యమండలిని ఏర్పాటు చేసుకున్నాం. ఉమ్మడి మెదక్ జిల్లా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై యక్షగానం ద్వారా ప్రచారం చేపట్టేవాళ్లం.

ఉత్తమ జానపద కళాకారుడిగా

గ్రామాల్లో యక్షగానం ద్వారా ప్రదర్శనలిస్తున్నప్పుడే దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియాలో కార్యక్రమాలు చేశాను. అప్పటి రాష్ట్ర రవాణ శాఖ మంత్రి (ప్రస్తుత ముఖ్యమంత్రి) కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు చేతుల మీదుగా ఉత్తమ జానపద కళాకారుడిగా అవార్డు పొందాను. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన యక్షగాన కళ ప్రదర్శకుగాను హరిప్రియ రంగరాజన్ చేతుల మీదుగా 'పల్లె సుద్దులు' అవార్డు పొందాను. ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి గీతారెడ్డి, మంత్రి తన్నీరు హరీశ్‌రావుల చేతుల మీదుగా ఉత్తమ జానపద కళాకారుడిగా అవార్డు పొందాను. సాంస్కృతిక శాఖ రాష్ట్ర డైరెక్టర్లు కేవీ రమణాచారి, అర్జా శ్రీకాంత్, కవితప్రసాద్, ఉమ్మడి మెదక్ జిల్లా కలెక్టర్లు లతకృష్ణారావు, బూర వెంకటేశం, దినకర్‌బాబు, స్మితసబర్వాల్ తదితరుల చేతుల మీదుగా అవార్డులు, సన్మానాలు పొందాను.

20 వేలకు పైగా నాటకాలు ప్రదర్శించా

యక్షగానం నేర్చుకుంటే భవిష్యత్ ఎలా ఉంటుందనేది మొదట నాకు తెలియదు. నాన్న వెంట వెళ్లి వేశాలు వేశాను. నా చిన్నప్పటి నుంచి సుమారు 20వేలకు పైగా నాటకాలు ప్రదర్శించి ఉంటాను. నాకు బాగా నచ్చిన నాటకం చిరుతోండ. ఇక నాకు బాగా నచ్చిన పాత్ర భానసూరవధలో భనాసూరుడు. నేను బాగా పాపులర్ అయిన నాటకం, పాత్ర విషయానికొస్తే..మైరావణుడు. భానసూరవధ నాటకంలోని భానసూరుని పాత్రకు రవీంద్ర భారతిలో మొట్ట మొదటిసారి అవార్డు వచ్చింది. అలాగే మా బృందంలో నాతో పాటు మా తమ్ముడు చిరంజీవికి, బృందంలోని చంద్రమౌళి, వెంకటయ్య, కిష్టయ్య, భుజంగంలకు పలు అవార్డులు వచ్చాయి. ఒక నాటకం వేయలంటే కనీసం 12మంది సభ్యులు ఉండాల్సిందే. నా చిన్ననాటి తనంలో వేరే పని చేసేవాళ్లం కాదు. కానీ ఇప్పుడు నాటకాలు వేసే వారు ఇతర కూలీ పనికి వెళ్లాల్సి వస్తోంది. చాలామంది కళాకారులు దినసరి కూలీలుగా పనిచేస్తు కుంటుంబాన్ని పోషించుకుంటున్నారు. నాకు పెళ్లయ్యాక కూడా నాటకాలు వేసి ఉపాధి పొందాను. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నందుకుగాను స్వరాష్ట్రం ఏర్పాటు అయ్యాక సాంస్కృతిక సారథిలో ఉద్యోగం ఇచ్చారు. ఇప్పుడిప్పుడే కుటుంబం కుదురుకుటుంది.



యక్షగాన ప్రదర్శనలో దేవదాసు బృందం

డబ్ల్యూహెచ్ఓ రాయబారి మిల్కాసింగ్

కరెంట్ అఫైర్స్



రామచంద్రారెడ్డి ఉప్పుల

అంతర్జాతీయం

పోలియో రహిత దేశంగా సోమాలియా

ప్రపంచ ఆరోగ్య సంస్థ సోమాలియాను పోలియో రహిత దేశంగా ఆగస్టు 13న ప్రకటించింది. మూడేళ్లగా సోమాలియాలో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాలేదు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆఫ్ఘనిస్థాన్, నైజీరియా, పాకిస్థాన్‌లలో మాత్రమే పోలియో కేసులు నమోదవుతున్నాయి. సోమాలియాలో చివరిగా 2014లో పోలియో కేసు నమోదైంది. సోమాలియాను పోలియో రహిత దేశంగా ప్రకటించినా వ్యాధికి గురయ్యే అవకాశాలు ఉన్నందువల్ల టీకాలను నిరంతరం అందించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించింది.

బార్సిలోనాలో ఉగ్రదాడి



స్పెయిన్‌లోని బార్సిలోనాలో ఆగస్టు 17న ఉగ్రవాదులు జరిపిన దాడిలో 13 మంది మరణించారు. బార్సిలోనాలోని లస్ రంబ్లస్ రహదారిలో ఉగ్రవాదులు వ్యానుతో పాదచారుల పైకి దూసుకెళ్లడంతో పలువురు గాయపడ్డారు. దాడి తమ పనేనని ఐసిస్ ఉగ్రవాద సంస్థ ప్రకటించింది. పోలీసులు ఐదుగురు ఉగ్రవాదులను కాల్చి చంపారు. పర్యాటకులు, జనసంచారంతో ఉండే ఈ దారిని దాడికి ఉగ్రవాదులు ఎన్నుకొన్నారు. 2004లో స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో అల్‌ఖైదా ప్రేరేపిత ఉగ్రవాదులు రైళ్లలో పేలుళ్లకు పాల్పడటంతో 191 మంది మరణించారు.

అమెరికా ఉగ్ర జాబితాలో 'హిజ్బుల్ ముజాహిదీన్'

కశ్మీర్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న హిజ్బుల్ ముజాహిదీన్‌ను విదేశీ ఉగ్రవాద సంస్థగా అమెరికా ప్రకటించింది. హిజ్బుల్ అధిపతి సయ్యద్ సలావుద్దీన్‌ను రెండు నెలల క్రితం అంతర్జాతీయ ఉగ్రవాదిగా అమెరికా ప్రకటించింది. 1989లో ఏర్పాటైన హిజ్బుల్ కశ్మీర్‌లో పెద్ద ఉగ్రవాద సంస్థల్లో ఒకటి. తాజా ప్రకటనతో ఆ సంస్థకు నిధుల సమీకరణ కష్టతరం కానుంది. ఆంక్షల కారణంగా హిజ్బుల్‌పై చట్టపరమైన సంస్థలు చర్యలు చేపట్టడానికి వీలుంటుంది.

జాతీయం

రికార్డు స్థాయిలో ఆహార ధాన్యాల దిగుబడి

దేశంలో ఆహార ధాన్యాల దిగుబడి 2016-17 సంవత్సరంలో రికార్డు స్థాయిలో నమోదైంది. 2016-17 మొత్తం 27.56 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి అయినట్లు కేంద్రం ఆగస్టు 16న ప్రకటించింది. 2015-16లో 25.17 కోట్ల టన్నుల ఆహార ధాన్యాల దిగుబడి వచ్చింది. వరి దిగుబడి 10.41 కోట్ల టన్నుల నుంచి 11.01 కోట్ల టన్నులకు పెరిగింది. గోధుమలు 9.29 కోట్ల టన్నుల నుంచి 9.83 కోట్ల టన్నులకు, పప్పు ధాన్యాలు 1.63 కోట్ల టన్నుల నుంచి 2.29 కోట్ల టన్నులకు పెరిగింది. చెరకు ఉత్పత్తి 11.98 శాతం మేర పడిపోయింది. పత్తి ఉత్పత్తి 3.01 కోట్ల బేళ్ల నుంచి 3.30 కోట్ల బేళ్లకు పెరిగింది.

ఇన్ఫోసిస్ సీఈవో విశాల్ సిక్కా రాజీనామా



ఇన్ఫోసిస్ సీఈవో విశాల్ సిక్కా తన పదవికి ఆగస్టు 18న రాజీనామా చేశారు. సీఈవోగా తప్పుకొన్న సిక్కాను కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్‌గా నియమించారు. తాత్కాలిక సీఈవో & ఎండీగా యూబీ ప్రవీణ్ రావును నియమించారు. 2014 జూన్ 12న సిక్కా ఇన్ఫోసిస్ సీఈవో & ఎండీగా బాధ్యతలు చేపట్టారు. 1986లో ఇన్ఫోసిస్‌లో చేరిన ఆయన ప్రస్తుతం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సీఐఐ నేషనల్ కౌన్సిల్, నాస్కామ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో ప్రవీణ్ సభ్యుడిగా ఉన్నారు. ఇన్ఫోసిస్ బీపీవోకు కూడా ప్రవీణ్ చైర్మన్.

డబ్ల్యూహెచ్ఓ రాయబారి మిల్కాసింగ్

